**నమ్మలేని నిజాలు**

**ఖ**ేలో ఇండియా
రికార్డు బనావోనా
దేశకే తారె.

**పం**చభూతాలు
కినుకుతో విలయం
పవిత్ర బంధం.

**ర**క్షా బంధనం
జ్ఞాన స్వశక్తి రక్ష
ప్రేమ ముడులు.

**తో**క గలవి
శూన్యజ్ఞాన జీవులు
బుద్ధి హీనత.

**ఆ**కు కూరలు
తీగకాయ కూరలు
మేనుకు మేలు.

– రేడియమ్
సెల్: 9291527757



# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com



**శ్రీరాజు**

మాతృభాషాభివృద్ధికి
కొండంత అండదండా !
వేల టీచర్లకు వెలుగు
డాక్టర్ సరోజన బండ !

ప్రపంచంలో ఒక వెలుగు
వెలిగిన ఇల్లాలు !
తెలుగు భాష తోటలోన
పూయించె మల్లెలు !

(తెలుగు భాష అమలు కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఉత్తమ అధ్యాపకురాలుదా. సరోజన బండ ఈనెల 22న అమెరికా లో తుది శ్వాస విడిచారు)

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 29-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:76 పేజీలు:68 వెల: రూ.1/-


## ఎస్‌టీపీల నిర్వహణపై ప్రత్యేక నిఘా..

**ఏఐ సాంకేతికతతో నీటి శుద్ధి కేంద్రాల పర్యవేక్షణ**
**ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, రైల్వే, మెట్రోకు శుద్ధి చేసిన నీరు**
**మంచినీటి కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు**



హైదరాబాద్, అక్టోబర్ 28(నేటినిజం ప్రతినిధి): నగరంలో శుద్ధి చేసిన మురుగునీటి (ట్రీటెడ్ వాటర్) వినియోగాన్ని విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీలు) నిర్వహణను మెరుగుపరచాలని సూచించారు. నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంనీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఎస్‌టీపీలు, శుద్ధి చేసిన నీటి వినియోగంపై నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు.

శుద్ధి చేసిన నీటి నాణ్యత, ప్లాంట్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఎస్‌టీపీ వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని సూచించారు. ప్లాంట్ల పర్యవేక్షణ బాధ్యతలను హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ (హైడ్రా)కు అనుసంధానించి పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని తెలిపారు. నీటి శుద్ధి ప్రక్రియలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల అవసరాలన్నింటికీ శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రాంగణాల్లోని ల్యాండ్‌స్కేపింగ్‌తో పాటు ప్రభుత్వ పార్కులు, ఇతర ప్రజా ప్రదేశాల్లోనూ ట్రీటెడ్ వాటర్ వాడాలని ఆదేశించారు. ఈ నిబంధనను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లోని పచ్చదనం నిర్వహణ, రహదారుల శుభ్రతకు కూడా శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని తెలిపారు. రైల్వే శాఖ, మెట్రో రైలు వ్యవస్థలను ఈ కార్యక్రమ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

కొత్త భవనాల నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలోనే ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించిన నిబంధనలను విధించాలని సీఎం ఆదేశించారు. ప్రైవేటు ఎస్‌టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకు కూడా శుద్ధి చేసిన నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్లాంట్ల నిర్వహణకు సౌర విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్ల కదలికలను ట్రాక్ చేయాలని సీఎం సూచించారు. శుద్ధి చేసిన నీటి కోసం వినియోగదారులు సంప్రదించేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. సంబంధిత విభాగాలన్నీ సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన గడువులోగా ఆదేశాల అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సీఎం అధికారులకు సూచించారు. శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని పెంచడం ద్వారా మంచినీటిపై ఒత్తిడిని తగ్గించాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి.పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నష్టం అంచనాకు కేంద్ర బృందాలను పంపండి..ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, అక్టోబర్ 21: ఆంధ్రప్రదేశ్‌పై ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలను త్వరితగతిన పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కోరారు.

ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. తుఫాన్ కారణంగా రాష్ట్రంలో పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని లేఖలో వివరించారు. నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని చంద్రబాబు తెలిపారు. సహాయక చర్యల్లో భాగంగా 14 జిల్లాల్లో 16 జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), 11 రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దించినట్లు పేర్కొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల నుంచి 28 వేల మందికి పైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు.

ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యల కారణంగా ఇప్పటివరకు ప్రాణనష్టం నవోదు కాలేదని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కంట్రోల్ రూమ్‌లు, రాష్ట్ర అత్యవసర ఆపరేషన్స్ కేంద్రం నిరంతరం పనిచేస్తున్నాయని వివరించారు.

తుఫాన్ ప్రభావంతో వ్యవసాయ రంగానికి భారీ నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాల్లో వెల్లడైందని చంద్రబాబు తెలిపారు.

భారీ వర్షాల కారణంగా సుమారు 70,900 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్లు పేర్కొన్నారు. అలాగే 10,450 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు వివరించారు.

కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, కృష్ణా జిల్లాల్లో తుఫాన్ ప్రభావం అధికంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పంట నష్టాన్ని అంచనా వేసి, బాధిత రైతులకు అవసరమైన సహాయం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలో 180 ఇళ్లు దెబ్బతిన్నాయని చంద్రబాబు వెల్లడించారు. రహదారులపై 220కి పైగా చెట్లు కూలిపోయాయని తెలిపారు.

తీర ప్రాంతాల్లో పలు చోట్ల రహదారులు ధ్వంసమయ్యాయని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని లేఖలో వివరించారు.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్, తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

తుఫాన్ నష్టంపై సమగ్ర అంచనా పూర్తయిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని చంద్రబాబు వెల్లడించారు.

నష్టం అంచనాకు వీలైనంత త్వరగా కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపించాలని అమిత్ షాను కోరారు. సహాయక చర్యలకు ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు ఇతర కేంద్ర సంస్థల సహకారం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు నిరంతరం సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్లు లేఖలో వివరించారు.


**చురక**

ఎదుటి వారి తిట్లు తప్పు
ఎప్పటికీ తమవే ఒప్పు
రోజు ఇదే సైకాలజీ
రోత రాజకీయ ముప్పు.
ప్రతి పాలక పార్టీలో
ప్రబలుతుంది ఇదే రీతి
ప్రజల్లో దిగజారుతూ
పోతుంది వారి ఖ్యాతి.



-వేల్పుల నారాయణ
9440433475



**రాధశ్రీ రాగాలు**

ఆత్రేయ చిత్రకవి
ఆరుద్ర ప్రాసకవి
గురజాడ జాతికవి
అనును రాధశ్రీ !!
కందమున తిక్కన్న
వెలదులకు వేమన్న
వర్ణనకు సోమన్న
ఘనులు రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210


## తీరం దాటిన ఆర్నబ్ తుఫాన్..
## ఉత్తర కోస్తాకు భారీ వర్ష సూచన

అమరావతి, అక్టోబర్ 28: ఏపీలో అల్లకల్లోలం సృష్టిస్తోన్న ఆర్నబ్ అతి తీవ్ర తుఫాన్ తీరాన్ని దాటింది. యానాంకు నైరుతి దిశలో నరసాపురానికి సమీపంలో తుఫాన్ తీరం దాటినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. తీరం దాటే సమయంలో అతి తీవ్ర తుఫాన్.. తీవ్ర తుఫాన్‌గా బలహీనపడినట్లు పేర్కొంది. తుఫాన్ ప్రభావంతో ఉత్తరకోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు కూడా సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆర్నబ్ తుఫాన్ తీరం దాటినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

ఏపీపై ఆర్నబ్ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. దాదాపు 36 ప్రాంతాల్లో 143 చోట్ల అత్యంత భారీ వర్షాలు, 205 ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది.

## భట్టి, సీతక్కకు పత్రికలు అందించిన షర్మిల



హైదరాబాద్, అక్టోబర్ 28:ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహానికి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కలను కలిసి వివాహ ఆహ్వాన పత్రికలను అందజేశారు. కుటుంబ సమేతంగా వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.వైఎస్ షర్మిల ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందించారు. నవంబర్ 25న జరగనున్న వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా విచ్చేసి వధూవరులను దీవించాలని కోరారు.

అనంతరం మంత్రి సీతక్కను ఆమె నివాసంలో కలిసి షర్మిల వివాహ పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క తనకు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటోను అందించారని షర్మిల పేర్కొన్నారు. ఆ ఫొటో తనకు ఎంతో ప్రత్యేకమైనదని, ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపికగా నిలుస్తుందని ఆమె భావోద్వేగంగా తెలిపారు.

## ప్రత్యేక రైళ్లు ఇవ్వకున్నా ఆగేదిలే : మహేష్ కుమార్ గౌడ్

**నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ మెగా ర్యాలీ**
**చివరి నిమిషంలో రైళ్లు ఇవ్వలేమని చెప్పడం సరికాదు**
**మోదీ, అమిత్ షా సూచనలతోనే రైళ్లు నిరాకరించారని టీపీసీసీ చీఫ్ ఆరోపణ**



హైదరాబాద్, అక్టోబర్ 28: ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ మెగా ర్యాలీకి ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఢిల్లీకి వెళ్లి ర్యాలీలో పాల్గొంటామని స్పష్టం చేశారు. ప్రత్యేక రైళ్లను నిరాకరించినంత మాత్రాన కాంగ్రెస్ శ్రేణులు వెనక్కి తగ్గబోవని తెలిపారు.

గత రెండు, మూడు నెలలుగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే ర్యాలీకి తెలంగాణ నుంచి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని ఎంపీలు అనిల్ యాదవ్, మల్లు రవి రైల్వే జనరల్ మేనేజర్‌కు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ అధికారులు స్పందించలేదని విమర్శించారు. ఆరు రోజుల పాటు కాలయాపన చేసిన రైల్వే అధికారులు, చివరి నిమిషంలో ప్రత్యేక రైళ్లు కేటాయించడం సాధ్యం కాదని చెప్పారని ఆరోపించారు. రైళ్ల కేటాయింపుపై విజ్ఞప్తి చేసేందుకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు.

ప్రత్యేక రైళ్ల కేటాయింపును నిరాకరించడం వెనుక ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనలు ఉన్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. దక్షిణాది నాయకులు ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అయితే, ఈ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం లేదా దక్షిణ మధ్య రైల్వే అధికారుల స్పందన అందుబాటులో లేదు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రవాణా సౌకర్యాల విషయంలో అవాంతరాలు ఎదురైనా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఢిల్లీకి చేరుకుంటామని స్పష్టం చేశారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసిన మహేశ్ కుమార్ గౌడ్.. ప్రత్యేక రైళ్లు ఇవ్వకపోయినా ఢిల్లీకి వెళ్లి నిరసనలో పాల్గొంటామని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నాలు ఫలించబోవని పేర్కొన్నారు. నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో జరిగే మెగా ర్యాలీలో పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపిస్తామని తెలిపారు.

## ఢిల్లీ నిరసనలకు ప్రత్యేక రైళ్లు కావాలని కాంగ్రెస్ మెరుపు ధర్నా.. పొన్నం, ఎంపీ రఘురాం రెడ్డికి అస్వస్థత



హైదరాబాద్, అక్టోబర్ 28(నేటినిజం ప్రతినిధి): సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మెరుపు ధర్నాతో ఉద్రిక్తత నెలకొంది. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అయితే ప్రత్యేక రైళ్ల కేటాయింపునకు దక్షిణ మధ్య రైల్వే నిరాకరించడంతో రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ నిరసనలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు.

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ రైల్వే అధికారులను కోరింది. అయితే దక్షిణ మధ్య రైల్వే నుంచి అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కాంగ్రెస్ నాయకులు రైల్ నిలయానికి చేరుకున్నారు. రైల్వే జీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో నేతలు రైల్ నిలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైళ్ల కేటాయింపును అడ్డుకుంటున్నారంటూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఏసీబీకి చిక్కిన ఇన్‌స్పెక్టర్..!

యాదాద్రి, అక్టోబర్ 28 ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరో అధికారిని పట్టుకున్నారు. యాదాద్రి జిల్లా కలెక్టరేట్‌లో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వెంకటే శ్వర్లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కా రు. పెట్రోల్ బంకు అనుమ తుల వ్యవహారంలో రూ.20 వేలు లంచం తీసుకుం టుం డగా అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు సమాచారం.

పెట్రోల్ బంకు అనుమతులకు సంబంధించిన పనిని పూర్తి చేసేందుకు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మొదటి విడతగా రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఈ డబ్బు తీసుకుంటున్న సమ యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి పట్టు కున్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేయడంతో అక్కడ కలకలం నెలకొంది. లంచం తీసుకుంటున్న అధికా రిని పట్టుకోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ చేపడుతున్నారు. లంచం డిమాండ్ చేసిన పరిస్థితులు, అనుమతుల వ్యవహారంలో ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


**తెలంగాణ రచయితల సంఘం**

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో..

**పన్నెండేండ్ల సభలు**

**వర్తమాన సాహిత్యం - తెలంగాణ సంభాషణ**

1 నవంబర్ 2026 ఆదివారం
ఉ॥ 10 గంటల నుంచి సా॥ 5 గంటల వరకు
వేదిక: రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్

**ప్రారంభ సభ**

సభాధ్యక్షులు : డా॥ నాళేశ్వరం శంకరం అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
కీలకోపన్యాసం : డా॥ కె. శ్రీనివాస్ సీనియర్ పాత్రికేయులు
అతిథులు : డా॥ నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత
దేశపతి శ్రీనివాస్ ఎమ్మెల్సీ
డా॥ ఏనుగు నరసింహారెడ్డి వి.ఏ.ఎస్. డైరెక్టర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
జి. దేవీ ప్రసాద్ పూర్వ అధ్యక్షులు, టి.ఎస్.జి.ఓ.
విరాహత్ అలీ అధ్యక్షులు, టి.యు.డబ్ల్యు.జె.
బైస దేవదాస్ ఎడిటర్, నేటి నిజం
కార్యదర్శి నివేదిక: డా. వి. శంకర్ ప్రధాన కార్యదర్శి, తెరసం

భోజన విరామం
1.00 ని॥ల నుండి 2.00

**మధ్యాహ్నం సదస్సు 2 గంటలకు**

సభాధ్యక్షులు : డా. బెల్లంకొండ సంపత్ కుమార్ ప్రధాన కార్యదర్శి, తెరసం జంట నగరాలు
వక్తలు : ఎన్. వేణు గోపాల్ ఎడిటర్, వీక్షణం
ఆచార్య బన్న అయిలయ్య ప్రొఫెసర్ (ర), కాకతీయ విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి : డా॥ నామోజు బాలాచారి కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
ఆప్తవాక్యం : కొండపల్లి నీహారిణి రచయిత్రి

**కవి సమ్మేళనం సా॥ 4 గంటలకు**

సభాధ్యక్షులు : కందుకూరి శ్రీరాములు అధ్యక్షులు, తెరసం జంట నగరాలు
ఆత్మీయ అతిథులు : డా. తూర్పు మల్లారెడ్డి రచయిత, పరిశోధకుడు
డా. వి. జయప్రకాశ్ తెలుగు భాషా చైతన్య సమితి

**పాల్గొను కవులు**

కందాళై రాఘవాచార్య, పాట్లపల్లి శ్రీనివాస రావు, శ్రీరామోజు హరగోపాల్, డా. చెమన్, దాసరాజు రామారావు, రూప్ కుమార్ డబ్బీకార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, గడ్డం సులోచన, మోతుకూరి అశోక్ కుమార్, పప్పుల రాజిరెడ్డి, సి.హెచ్. ప్రకాశ్, ఘనపురం దేవేందర్, సి.హెచ్. ఉషారాణి, వాసరచెట్ల జయంతి, ధూళిపాల అరుణ, యరకల యాదయ్య, బిల్లా మహేందర్, దేవనపల్లి వీణావాణి, వాణి దేవులపల్లి, దాసరి మోహన్, ఎం. కవిత, ఎం.డి. అహ్మద్, ఎం. రాజశేఖర్, వేణుశ్రీ, గుండెల్లి ఇస్తారి, డా. పాశ్రెడ్డి రంగయ్య, కె. నవీన్ కుమార్, నరేశ్ చారి, డా. పాన్నాల బాలయ్య, గంభీరావుపేట యాదగిరి, డా. సిద్దెంకి యాదగిరి, డా. తైదల అంజయ్య, డా. కాసర్ల నరేశ్ రావు, దొమ్మాట శంకర్ ప్రసాద్, కార్తీకరాజు, పానుగంటి రామమూర్తి, డా. జీడి రమేశ్, రుద్రంగి రమేశ్, సుప్పని సత్యనారాయణ, క్రాంతి కుమార్, నరాల సుధాకర్, నల్లగొండ రమేశ్, ఉప్పల పద్మ, గుత్వ ప్రసాద్, గొర్రె అనిల్ కుమార్, పట్లోళ్ల బక్కారెడ్డి.

సాహితీ మిత్రులందరికీ సాదర ఆహ్వానం

నేటినిజం
సాహితీ కేరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 29-10-2026

## ప్రశాంతత ఎప్పుడో...

ఉర్వి పచ్చిపుండయింది
దారంతా ముళ్ళమయం
నేడు పెను భారమైంది.
మాట్లాడితే తప్పులు
శ్వాసిస్తే పెను ముప్పులు
బతుకంతా నిప్పు సెగలు.

నవ్వు కరువైంది
మనసు శిలగా మారింది
ఆనందం ఆకాశ కుసుమం.
మనసువిప్పితే పాపమైంది
నిజం చెప్పితే నేరమైంది
గొంతులకు తాళాలు..

బట్టకట్టే స్వేచ్ఛలేదు
ఆత్మగౌరవంపతాకాన్ని
ఎగరేస్తే దేశద్రోహం...
భూగోళం శ్మశానమైంది
ఏడ్పులన్నీ నిషేధాలు
గోడు వినే ప్రభువులేడు.

బాధ చెప్పే ప్రాంతాలన్నీ
బందిఖానలో తొక్కివేస్తే
స్వేచ్ఛ ప్రశ్నకు ప్రశ్నైంది.
ఆలోచనే నిషిద్ధమిత్
ప్రగతివెలుగులుఎక్కడో
మనిషికి ప్రశాంతతెప్పుడో?



-చకొనా
9885797375

## రక్షణ దీపాలు

ఇంటా బయటా భయాల నీడలు
అలముకున్నవి మహిళలపై విషపుచాయలు
వ్యవస్థలెన్ని ఉన్నా సరిపోవడం లేదు
చీకటిలో చిరుదీపం వెలిగించెను సహచరి!.
సమాజంలోని కొందరు ధీర వనితలు
యూనిఫామ్ లేకుండానే రక్షకులయ్యారు
బాధిత సోదరీమణులకు అండగానిలిచారు
చుట్టూ ఉన్నవారికి భరోసా ఇచ్చే సహచరి!.
వారి కళ్ళలో కరుణ జ్యోతి వెలుగుతోంది
వారి మాటల్లో ధైర్యం నిండి ఉంది
వారి చేతుల్లో ఆయుధాలు లేవు
మదిలో మానవత్వం నింపుకుంది సహచరి!.
రోడ్డు ప్రమాదాల భయం తొలగించే సహచరి
డ్రగ్స్ వ్యసనాల చీకటి పారదోలే సహచరి
సైబర్ నేరాల జాలం నుండి కాపాడే సహచరి
పిల్లల రక్షణకు అండగా నిలిచే సహచరి
భయంతో వణుకుతున్న ప్రతి ప్రాణానికి
ధైర్యం నింపే దీపంగా మారుతుంది సహచరి.
తన చుట్టూ ఉన్న చీకటిని తొలగిస్తూ
ఆర్తనాదస్వరూపమేదైనా ముందడుగు వేస్తూ
మహిళా రక్షణకు కొత్త దారి చూపిస్తూ
నిశ్శబ్దంగా నీ నీడగా నిలిచే సహచరి!.
రక్షణ వ్యవస్థలో భాగమై స్త్రీకి స్త్రీయే తోడూనీడై
విశాల హృదయంతో బాధితురాలిని
అక్కున చేర్చుకుంటూ
సమాజం గుండెల్లో చైతన్యం నింపుతూ
గొప్ప పనులకు అంకురార్పణ చేసే సహచరి!.
వారు సాధారణ మహిళలే కావచ్చు
కానీ మనతో మసలే ద్రష్టలు వారు
భయాలను జయించే ధైర్యం వారిది
ఆశలకుఊపిరిలూదే ప్రాణవాయువే సహచరి.
ఈ రక్షణ దీపాలు వెలుగుతూ ఉండాలి
సమాజం అంతా ప్రశాంతంగా ఉండాలి
మహిళలు భయం లేకుండా తిరగాలి
సహచరుల స్నేహంతో స్త్రీ సురక్షిత కావాలి.
తెలంగాణ బిడ్డ 'సు'మదిలో మెదిలింది
'సహచరి' రక్షణగా ఆకృతి చెందింది
సామూహిక స్త్రీ శక్తిగా వికసించింది
ఇంటింటా రక్షణ దీపాలు వెలిగించింది.

-చివుకుల శ్రీలక్ష్మి
9441957325

## అస్తిత్వం

ఆమె ఒక కవి
తన కన్నీటిని కాటుకగా దిద్ది
లక్ష్మణ రేఖగా గీసిన ధైర్యశాలి!!
తన కంటి వెలుగు విశ్వ కాంతియై చీకటిని
తరిమికొట్టే తొలి కిరణం
తనలో దాగి ఉన్న శక్తిని పూజించు నిన్ను
చల్లగా దీవిస్తుంది !!
చెల్లిగా , ఆలీగా నీ దానిగా తోడుండే
నీ నీడగా మారి నేనున్నానని
వెన్ను తట్టే స్నేహమాలిక !!
తన కలలను పక్కన పెట్టి
నువ్వు కనే కలలన్నీ సార్థకం చేసే
త్యాగశీలి తన మౌనంలో కూడా
కవిత దాగి ఉంది!!
కుంచంలో ప్రాణం పోసిన
సిరాచుక్క ఆమె !!
ఎన్నో బాధలు ఉన్నా
మొదట గుర్తుకొచ్చే పేరు ఆమె !!
మాటే మంత్రమై నీలో
స్ఫూర్తిని నింపుతుంది
ఆమె నవ్వులో అలసట మాయమవుతుంది
ఆకలి తీర్చే అన్నపూర్ణ ఆమె
చీర కొంగులోనే ప్రపంచాన్ని
సహితం దాచగల ప్రజ్ఞాశాలి
ఆమె లేకుంటే
సృష్టి కొనసాగేనా?



-పి.సూర్య శ్రీకళ
78930 87349

## చీకటి వెలుగులు

కులాన్ని లాక్కుంటున్నారు...
మతాన్ని లాక్కుంటున్నారు...
చివరికి
మనిషిలోని మనిషితనాన్ని కూడా
ముక్కలు ముక్కలుగా
ఎవరో కొల్లగొడుతున్నారు...
అయినా,
వెలుగులో ఉన్నామని
విర్రవీగుతున్నాం...
వెలుగంటే ఏమిటో
తెలియని మనం
వెలుగు గదిలోనే
చీకటిని పెంచుకుంటున్నాం...
కనిపించని విష సర్పాలు
మన చుట్టూ చేరి
విషపు కోరలతో
మనిషితనాన్ని కాటేస్తున్నాయి...
కళ్ళకు వెలుగు ఉంది...
కానీ చూపుకు చీకటి కమ్మింది
చేతిలో దీపం ఉంది
కానీ మనసులోనే
మంటలు రగులుతున్నాయి.



-ఎలగొండ రవి,
9848770345

# తెలంగాణ విప్లవ సాహిత్యంలో సుద్దాల హనుమంతు చిరస్మరణీయులు



సభలో ప్రసంగిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

## ఎంతో మందికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకం: అద్దంకి

### ఘనంగా సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం



సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ సమితి పురస్కారాన్ని స్వాతి శ్రీపాదకు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్. చిత్రంలో ఆచార్య వెల్దండ నిత్యానందరావు, సుద్దాల అశోక్‌తేజ దంపతులు, నెల్లుట్ల రమాదేవి తదితరులు.



స్పందన తెలియజేస్తున్న పురస్కార గ్రహిత స్వాతి శ్రీపాద.

హైదరాబాద్, అక్టోబర్ 28:(నేటినిజం ప్రతి నిధి): తెలంగాణ విప్లవ సాహిత్య పరంపరలో సుద్దాల హనుమంతు పాత్ర చిరస్మరణీయమని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. తనలాంటి వారికి ఎంతో మందికి ఆయన జీవితం స్ఫూర్తినిచ్చిందన్నారు. తెలంగాణ డీఎన్ఏలోనే జానపదం, పోరాటం, ఉందని అన్యాయం జరుగుతుంటే కవి నుంచి సామాన్యుడి వరకు అన్ని వర్గాల ప్రజలూ ప్రశ్నిస్తారని తిరగబడతారని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీం ద్రభారతిలోని సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుద్దాల జానకమ్మ, హనుమంతు' జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. దీంట్లో బాగంగా జాతీయ సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవయిత్రి స్వాతి శ్రీపాదకు, జాతీయ జానపద పురస్కారాన్ని యక్షగాన కళాకారుడు మహ్మద్ అక్బర్‌పాషాకు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ జానపద అకాడమీని నెలకొల్పి దానికి సుద్దాల హనుమంతు పేరు పెట్టాలన్న ప్రతిపాదనను, సుద్దాల ప్మారక అవార్డు ప్రదానోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్న విజ్ఞప్తిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తెలుగు వర్సిటీ వీసీ వెలుదండి నిత్యానందరావు మాట్లాడుతూ.. సమాజ చైతన్యానికి సాహిత్యం, జానపద కళలు, శక్తివంతమైన ఆయు ధాలని, సుద్దాల కుటుంబం తరతరాలుగా కళలకు సేవ చేస్తోందని కొనియాడారు. ప్రముఖ పాటల రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. తమ తలిదండ్రుల జ్ఞాపకార్థం ఏటా కళాకారులను, రచయితలను గౌరవించుకోవడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అనువాద సృజనలో స్వాతి శ్రీపాద కృషిని వక్తలు కొనియాడారు. కళాకారులకు, కులమతాల అడ్డంకులు లేవన్న సందేశాన్ని మహమ్మద్ అక్బర్ పాషా ఎలుగెత్తి చాటుతున్నారని, ఈ దేశ బహుళత్వానికి ప్రతీకగా రాముడు, కృష్ణుడు పాత్రలను కూడా ఆయన రంగస్థలం మీద అభినయిస్తున్నారని ప్రశంసించారు.

## సృష్టి సాగు

కలంలోంచి జారే ఒక పదం
కాగితపు పొలంలో చిగురించే క్షణం...
నాగటి చాలున పడే ఒక విత్తనం
మట్టి గుండెల్లో ఊపిరి పోసుకునే క్షణం...
ఒక్కటే!
రెంటి వెనుక ఉన్నదీ ఒకే సృష్టి వేదన,
రెంటి లోతుల్లో ఉన్నదే ఒకే మౌన ధ్యానం!.

పైపైన చూసే ఈ లోకం అనుకుంటుంది-
కవి కేవలం
కాగితంపై గీతలు గీస్తున్నాడనీ,
రైతు కేవలం
నాగలి వెంట నడుస్తున్నాడనీ!
ఆ లోతుల్లోకి తొంగి చూస్తే-
ఒక్క వాక్యం వెనుక ఎంత తాత్విక
మధనం ఉందో,
ఆలోచనల క్రమాన్ని పేర్చడంలో
ఎంత కఠోర శ్రమ ఉందో...
కలం పట్టి నిలబడితే గానీ తెలియదు!
అలాగే,
నాగలి పట్టడం అంటే
కాయ కష్టం మాత్రమే కాదు-
అదొక అజ్ఞాత యోగం!
చాలు వంకర పోకుండా దిద్దే చూపు,
ఎడ్ల నడకను నిగ్రహించే నేర్పు,
భూమినీ, తననూ సమంగా నిలబెట్టుకునే
సమతుల్యత...
మట్టిపై రాసే ఒక అద్భుత జీవన కావ్యం!.

కలానికి కాగితం లోతు తెలిస్తే
భావం పండుతుంది,
హలానికి మట్టి మనసు తెలిస్తే
జీవం పండుతుంది!
అక్షరం మేల్కొల్పేది మనిషి చైతన్యాన్ని,
అన్నం నిలబెట్టేది మనిషి ఉనికిని!
కవి కలంలోంచి రాలేది అక్షరపు స్వేదం అయితే,
రైతు మేని నుంచి చిందించేది జీవ బిందువు!.

కాగితం పైన ఆలోచనల సమన్వయం కుదరకపోతే
కావ్యానికి పరిమళం ఉండదు,
నాగటి పైన శరీర నిగ్రహం కోల్పోతే
దున్నిన చాలుకు రూపం ఉండదు!
కవి సమయం సమాజానికి దిశ చూపితే,
రైతు శ్రమ జగత్తుకు శ్వాసనిస్తుంది!.

అక్షరాలతో ఆలోచనల విత్తనాలు చల్లి
మనిషి ఆత్మను చైతన్య పరుస్తాడు కవి.
సేద్యంతో జీవ విత్తనాలు చల్లి
మనిషి దేహానికి ప్రాణదానం చేస్తాడు రైతు.
ఒకరు భావాల పంట దిగుబడి చేసే
ఆలోచనా శిల్పి,
ఇంకొకరు ఆకలి నైవేద్యాన్ని తీర్చే
అన్న శిల్పి!.

కలమైనా, హలమైనా...
పట్టే చేతిలో నిగ్రహం ఉండాలి,
దిద్దే తీరులో శ్రద్ధ ఉండాలి!
సృష్టి శ్రమలో ఎవరూ ఎవరికీ తీసిపోరు,
ఈ జగత్తు రథానికి ఇద్దరూ రెండు
మహత్తర చక్రాలే!



-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007:

# కులం జులుంపై కలమెత్తిన వనపట్ల

కుల సర్పాలు
బతుకు సూర్యుడిని మింగినప్పుడు
ఒక వేగుచుక్క పొడిచింది!

వనపట్ల కవితలోని ఈ తొలి పంక్తులు ఈ కవిత ఏమిటో? దేనికో? ఎందుకో? ఎలాంటి శషబిషలు లేకుండా ముక్కుసూటిగా చెప్పేశాయి. ఒక దీర్ఘ కవితను బిగి సడలనివ్వకుండా కొనసాగించడం చాలా కష్టం. అలాంటి కష్టసాధ్యమైన పనిని సునాయాసంగా చేయడమే కాదు. బహుజన తాత్వికతను ప్రతి పంక్తిలో పలికించాడు వన పట్ల. బతుకు సూర్యుడిని మిం గిన కులసర్పం. ఈ కుల సర్పాన్ని కుళ్ళబొడిచిన వేగు చుక్క.. ఈ రెండు మన కంటి ముందు చీకటి వెలుగుల్లా ఈ కవితలో కనిపిస్తుంటాయి.

భారతదేశంలో అంటరాని తనంపై, కుల వివక్షపై, స్త్రీ విద్యా ఆవశ్యకతపై గళమెత్తిన మొట్ట మొదటి సంఘసంస్కర్త, యుత పురుషుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే. సత్యశోధక్ సమాజ స్థాపన తో మహారాష్ట్రలో ఉదయించిన ఫూలే దేశమంతా వెలుగులు చిమ్మారు. సమానత్వం కోసం, మానవీయ విలువల పరిరక్షణ కోసం ఆచరణ సాధ్యమైన ప్రణాళికను సిద్ధం చేసి దేశానికి అందించిన క్రాంతదర్శి మహాత్మా జ్యోతిరావు ఫూలే.

బడుగులే
భారతావనికి ముందు చూపని
శిరసెత్తిన చేతనాకేతనం!

జ్యోతిబా ఫూలే క్రాంతదర్శి అని చెప్పడానికి ఒకే ఒక్క ఉదాహరణ చాలు. ఆ కాలంలోనే ఆయన "విస్మృతుల విముక్తికై, సహచరికి చదువును బోధించాడు".

నస్త్రీ స్వతంత్రమర్హతి అని చెప్పే కాలంలో జ్యోతిబాఫూలే సాధించి చూపించిన గొప్ప సం స్మరణోద్యమం మహిళా విద్య. సంఘ సంస్కరణ ఇంటి నుండే ప్రారంభం కావాలనే విశ్వాసమున్న ఆచరణ శీలి. స్త్రీ విద్యా వ్యాప్తి కోసం మొదట తన సహ చరి సావిత్రి భాయి ఫూలేకు అక్షర గంధం అద్దాడు. సం స్కర ణల ఆవశ్య కతను ఆమెకు నూరి పోశాడు. తాను చదువు కుని, ఉపాధ్యాయ వృత్తిని ఎన్ను కున్న సావిత్రిబాయి ఫూలే స్త్రీల కోసం ప్రత్యేక పాఠశాలలు నెల కొల్పి భర్త సహకారంతో ఎన్ని అవాంత రాలు వచ్చినా నిలబడి విజయ వంతంగా నిర్వహించిన ఆదర్శ మహిళ.

నిజం చెప్పాలంటే ఓబీసీ కులాల్లో మహిళలు పురుషులతో పాటు సమానంగా శ్రమిస్తారు. పొలం పనుల్లో అయితేనేం, కా య కష్టంలో అయితేనేం ఓబీసీ కులాల స్త్రీలు ఇంటి నాలుగ్గో డలకు పరిమితం ఎన్నడూ కాలేదు. శ్రమైక జీవన సౌందర్యం వారి జీవితాల్లో కనిపిస్తుంది. బహుజన జీవన తాత్వికత ఇది. సామాజిక కార్య కలాపాల్లో కని పిస్తుంది. బహుజన జీవన తాత్వి కత ఇది. సామాజిక కార్యక లాపాల్లో సమానంగా పాల్గొంటూ వచ్చారు. జ్యోతిబా ఫూలే సంస్కరణోద్యమం స్త్రీలకు విద్యారంగంలోను అవకాశాలు కల్పించింది. ఆనాటి సమాజంలో ఉన్న వితంతువుల సమస్యను పరిష్కరించడానికి వితంతువులను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పిన మహాత్మాఫూలే, సావిత్రిబాయి ఫూలేలు వెలిగించిన దీప కాం తులు ఆనాడు దేశమంతా వ్యాపిం చినవి. భారతదేశానికి కాంతి కిరణం, రాజ్యాంగ నిర్మాత అయిన బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయుడు గురువుగా చెప్పు కున్న మహానుభావుడు జ్యోతిరావు ఫూలే. వారి జీవితం వర్తమాన సమాజానికి స్ఫూర్తి వంతం కావలసిన సందర్భమిది.

కాళ్ళకు
కత్తులు కట్టుకొని కాటేస్తున్న కులోన్మాదాన్ని
కూకటేళ్ళతో పెకిలించి
కర్మసిద్ధాంతం కాదు
బతుకు సిద్ధాంతం కావాలని
తలరాతలు కాదు
బతుకు రాతలు మారాలన్న
మహెదయుడు.. జ్యోతిబా ఫూలే.

పేదలు అన్ని కులాల్లోను ఉంటారు. అగ్రకులాల్లోను ఉం టారు. కాని అగ్రకులాల్లో పేదలకు కులం కారణంగా లభించిన సదుపాయం సమాజంలో వెసులుబాటుకు కారణం అవుతుంది. నిమ్న కులాల వారికి ఈ వెసులు బాటు ఉండదు. బతుకు సిద్ధాం తం అని వనపట్ల రాసిన పంక్తుల్లోని అంతరార్థం మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది. తలరాతలు, కర్మసిద్ధాంతాలు కాదు బతుకురాతలు మార్చుకోవాలని చెబుతూ జ్యోతిబా ఫూలే స్ఫూర్తిని మనలో ఒంపడానికి ప్రయత్నించాడు వనపట్ల. కాలం వెంట నడిచే వనపట్ల సుబ్బయ్య నేటి తరానికి అవసరమైన మహాను భావుడైన మహాత్మా జ్యోతిరావు ఫూలే జీవిత చరిత్రను 'బహుజన బావుటా' పేర దీర్ఘ కవితగా మలిచాడు.






ప్రతులకు:
వనపట్ల సుబ్బయ్య
సెల్:9492765358

(వనపట్ల సుబ్బయ్యా రచించిన "బహుజన బావుటా" పుస్తకానికి జూలూరు గౌరీశంకర్ రాసిన ముందుమాట.)

ఇప్పటికే సుబ్బయ్యకు 'జులూస్', 'కుర్చీ', 'వొల్లెడ' వంటి పాఠకాదరణ పొందిన దీర్ఘ కవితలు రాసిన అనుభవం ఉంది. 100 పేజీలకు పైగా వున్న ఈ దీర్ఘ కవిత అంతా మట్టి వాసనతో, కవితాత్మకంగా, సులభ గ్రాహ్యంగా ఉంది. వనపట్ల సుబ్బయ్య నిత్య కవి, సత్యకవి. తన అనుభవాన్ని అంతా రంగరించి ఒక ఊపులో రాసిన దీర్ఘ కవిత ఇది. ప్రారంభం నుంచే పాఠకులను వెంట నడిపించే గుణం సుబ్బయ్య కవిత్వానికి ఉంది. ఈ కవిత ప్రారంభంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే జననాన్ని చెబుతూ...

ఆచారాలు
సామాన్యుల గుండెల్లో పుండు చేసినప్పుడు
'మహాబలి' ఉదయించాడు!

అన్నాడు. ఈ చిన్ని మూడు పాదాలతో మహాత్మా జ్యోతిరావు ఫూలేను వనపట్ల ఎలా అర్థం చేసుకున్నాడో మనం తెలుసు కోవచ్చు. అక్షరాస్యత అవసరం గురించి ఫూలే ఎలా చెప్పారో వివ రిస్తూ..

అంధకారానికి
అక్షరమే ఆయుధమని
అడుగడుగునా చదువులను పంచి
దేహాన్ని చెలిమె చేసి
అట్టడుగు జనుల
దూప తీర్చిన మహోన్నత మూర్తి!

అంటూ ఫూలే దూరదృష్టిని అక్షరబద్ధం చేశాడు. కింది కులా ల విముక్తికై. కుల సంకెళ్లను తెం చి, స్వేచ్ఛకు పురుడు పోసి, మాన వ హక్కుల్ని దోసిట్లకు వొంపిన ఆధునిక సామాజిక విప్లవ పితా మహుడని పూలేను కీర్తించాడు.

చదువులే
బువ్వ పెడ్తవి
బతుకులను నిలబెడ్తవి
రండీ బహుజనులారా
చదువుకోండి!

అని జ్యోతిరావు ఫూలే ఇచ్చిన పిలుపును వనపట్ల సుబ్బయ్య మనకు గుర్తు చేశాడు. అంతే కాదు, ఆ పిలుపే తర్వాత బహుజన సమూహాల్లో చైతన్యాన్ని రగిలించిన నిప్పు రవ్వయింది.

ఇవ్వాళ
బాజాప్తగ హక్కులు అడుగుతున్నరంటే
ఆయన సామాజిక పోరాటమే స్ఫూర్తి
ఆ మహాత్ముని జ్ఞానమే పునాది!

అంటూ జ్యోతిబా ఫూలే వెలిగించిన చైతన్యాన్ని గుర్తు చేసుకు న్నాడు.

కానీ
తరతరాలకు స్ఫూర్తిదాయ కమైన బహుజన చైతన్యం గురించి నేడు ఎక్కడ ఎవరు ప్రస్తావిస్తున్నారు? ఇదే ప్రశ్న సుబ్బయ్య కవితలో నిలదీసి అడిగాడు.

దేశ చరిత్రలో
ఏ పేజీ వెతికినా
మీ జీవిత పాఠం లేదు
ఏ పంతులు మీ పాఠాన్ని బోధించలే
ఏ గ్రంథాలయాన్ని వెతికినా
మీ గ్రంథాల జాడలేదు!

అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఆవేదన మనందరి ఆవేదన కావలసిన అవసరం ఉంది.

ఓ మహానీయా!
మీ పాదాలకు తలవొంచి నమస్కరిస్తున్న
మీ జన్మదినమే మాకు పెద్దపండుగ

అని వనపట్ల రాసిన పంక్తులు మనందరికి మన కర్తవ్యాన్ని బోధిస్తున్నాయి. నిలువెత్తు స్ఫూర్తిమ త్వం జ్యోతిభా ఫూలేను తరతరాలు గుర్తుంచుకోవలసిన అవస రాన్ని చాటి చెబుతున్నాయి.

వనపట్ల సుబ్బయ్య కవిగా భిన్నమైనవాడు. తన ఒడుపును, పలుకుబడిని, తన పరిసర ప్రాం తాల సుగంధాన్ని వీడని కవి మిత్రుడు. వస్తువు ఏదైనా సౌంద ర్యవంతం చేసే విద్య అతనికి కరతలామలకం. అదే విధంగా ఎక్కడా పునరుక్తులు లేకుండా ఏకబిగిన దీర్ఘ కవిత్వం రాయడం కత్తి మీద సామే. ఆ పనిని వన పట్ల సుబ్బయ్య ఎంతో నిబద్ధతగా నెరవేర్చినందుకు అభినంది స్తున్నా...ఆలింగనం చేసుకుం టున్నా.. 'సబ్బండ కులాల ఎదుగుదలే దేశం ఎదుగుదల'గా కవితా రచన కొనసాగాలని వాంఛిస్తూ...

-జూలూరు గౌరీశంకర్

# శ్రీరాములుగారు తెల్సుకున్న కవిత్వంలోని రహస్యాలు

"నా ఏకాంత పరిమళం... కవిత్వం" అట్టమీద వెనుర రచయిత యక్కలూరి శ్రీరాములు కవిత్వం అటే ఏమిటో వివరిం చారు. 'స్థితి' లయలే కవిత్వం సాహిత్యం, కళలన్నీ స్థితిలయల స్వరూప సమ్మేళనం అంటారు. ప్రకృతిలో మమేకమై అనుభవి ంచిన 'స్థితి'ని వర్తమాన, భవిష్యత్ కాలాలకి అందించడంలో కవి త్వం ప్రథమ స్థానంలో వుంటుం దన్నారు. ఒక పదంలో, ఒక అక్షరంలోనే కావ్యాన్ని చూపించి మనిషిని తన్మయత్వం చేసే రస ప్లావితం, ఇంద్రజాలం కవిత్వం. సకల ప్రాణ కోటి హితమే, సమానత్వమే కవిత్వం సకల లోకాల సమన్వయిత తత్వమే నూతనత్వమే కవిత్వం అంటూ చెప్పుకొచ్చారు. కవులే ఋషులు, ఋషులే కవులు, కవిత్వమే ఋషిత్వం, ఋషిత్వమే కవిత్వం. ఇదీ యక్కలూరి వారి కవిత్వం అన్నదానిపై అభిప్రాయం. ఈ పుస్తకాన్ని అంకితం అంటూ రాసిన మాటలూ నాకు ఎందుకో కొత్తగా అనిపించాయి. 'నన్ను ప్రేమిం చామని చెప్పినవారికి.. నేను ఏ ఒక్కరినో ప్రేమించలేదని చెప్పినా విననివారికి' అంటూ అర్పించడం మరి ఎలా వుంటుందో ఆలోచిం చండి. వీరి కవితలు కూడా ఇలాగే వున్నాయి. చదువుతుంటే. మూడు నెలలు ముచ్చెటమలు పట్టించిన ఎండలకి పచ్చిపుండైన నా తనువు చిరుజల్లులై కురిసే ఒకే ఒక వానకి నెమలి ఫించమై పురివిప్పిన ఇంద్రధనువు అంటూ వ్రాసుకొచ్చారు. అట్టమీది బొమ్మ లో కూడా ఈ నెమలి పించమే దర్శనమిస్తుంది. చినుకు చినుకుకి తన అనుభూతులను అక్షర రూపంలో రహస్యాలుగా అందిం చడం శ్రీరాములుగారి ప్రత్యేకత అనిపించింది. శిరస్సుపై రాలే చినుకులన్నీ **'శతమానం భవతీ'** అని అక్షింతలు చల్లాయట. సుదరును తాకే చినుకులన్నీ, సుఖీభవ సుఖీభవని ఆయన తలరాతను లిఖిస్తున్నా యట. ఇలా చినుకుల మర్మాన్ని **'వానలో తడు స్తూ నడుస్తుంటే'** అన్న రచనలో విపులీకరించారు. వానలో తడుస్తూ నడుస్తుంటే ఎన్ని రకాల భావనలు, ఎన్ని రకాల ఆలోచ నలు చోటు చేసుకున్నాయో మరి. ఓ పువ్వుకు ఎగిరే రెక్కలున్నాయ్ అన్న రచనలో సీతాకోక చిలుక నోచుకున్న భాగ్యానికి తెగ ఈర్ష్య పడుతూ, ఆపైన ఓ సౌందర్యం పలికా సీతా కోక చిలుకా, నా ప్రతి అక్షరాని కిరువైపుల నీ రెండు రెక్కల్ని తగిలించు, నువ్వు నా కవితల పుస్తకమై జగతిలో విహ రించు అంటూ కోరడంలో ఎంత స్వార్థం వుందో కదా! రెక్కలున్నది నీతాకోక చిలుకకు అయినా కవి చమత్కారంగా ఓ పువ్వుకు ఎగిరే రెక్కలున్నాయ్ అనడం బాగుంది. 'ని.శ్శబ్దం' అన్న కవితలో, నిశ్శబ్ద నికి నిశ్శబ్దానికే నడుమనే శబ్దం లయిస్తుంది. శబ్దానికి




**ప్రతులకు:** శ్రీ ప్రచురణలు12-3-257, 6వ క్రాస్ 6వ వీధి, సాయినగర్, అనంతపురం-515001 ఆంధ్రప్రదేశ్.

శబ్దానికి మధ్యనే నిశ్శబ్దం జనిస్తుంది అంటారు. అంతేకాదు చూపులు కలుసుకుంటున్నప్పుడు నిశ్శబ్దమే కదా అంటూ చెప్పుకొచ్చిన కవి నిశ్శబ్దం కొరవడినప్పుడు జీవి తాన స్థబ్దతే ఆవరిస్తుంద న్నారు. నిశ్శబ్దంలో జీవిస్తున్నప్పుడూ ఏకాకిగా మీటుకుంటాను అంటారు. ఆయన ఏకాంతంలో ఏకతారగా చెప్పుకున్నారు.

తీరాలు రెండైనా.. నది ఒకటే.. ఈ కవితలో, ప్రేమలోనూ ప్రేమతోనూ అంగాంగ శృంగార ఫలదీకరణం, క్షణ క్షణం నేనోస్క లన సద్భశమై జీవించడం గర్వ కారణం అన్నారు. నువ్వు నేనుగ నేను నీవుగా జన్మించినా ఇలలో ఇరువురం ప్రేమలో ఒకటేకదా, తీరాలు రెండైనా ప్రవహించే నది ఒక్కటే కదా. అవును మరి. కవి చెప్పింది అక్షరాలా నిజం. కవి స్థితి, పరిస్థితి, ఒక విధంగా ఏక స్థితే మరి.

**'ఏ కాంతం'** అన్న రచనను ప్రారంభిస్తూనే ఆ ఒక్క పై పదం తోనే ఈ కవితను ముగించవచ్చు. అవును..ఇంతటితోనే ఈ రచనకి మంగళం పాడేయనూవచ్చు.. కానీ.. వారు ఏకాంతాన్ని మనతో పంచుకోవాలనే నాలుగు పేజీల్లో వారి మనోభావాలను ఏకరువు పెట్టారు. చివరగా ప్రపంచానికి ఏకాంత మందించేది కవిత్వమే తెలుసా, నాకు ఏకాంతమంటే కవిత్వమే అనడం అద్భుతంగా వుంది. ఈ ఏకాత్మ భావనాను భవం కవులకు మాత్రమే అర్థం అవుతుంది.

సెక్యులరిజానికి పెద్దపీఠం వేస్తూ ఒక కవిత, 'నేనొక ఇన్సాన్' అంటూ రాసారు. ప్రపంచంలోని పండగలన్నింటిలోనూ నేనో మతాతీత ఇన్సాన్ అంటూ స్పష్టం చేశారు. బాగుంది.

ఆత్మానందం అన్నపేరుతో రాసిన కవితలో నేటి మానవ నైజాన్ని అద్దంలో చూపించారు. మనిషికి మనిషి గాలం వేయడమే ఒక హాబీ. మనిషిని మనిషి వేటాడమే ఇక్కడ థ్రిల్. మనిషిని మనిషి వెంటాడటమే ఎక్కడలేని ఖుషీ అంటూ రాసుకొచ్చారు. మనిషన్న వాడు అత్యాధునికమైన ఆయుధమైన డబ్బు కోసం కాయాన్ని చీల్చి చీల్చి ఒళ్ళువొల్చి వొల్చి, మనిషిని మనిషే కాల్చుకు తింటున్నాడు. ఇక్కడ మనిషిన్న వాడూ కేవలం మనిషి మాంసా నికే అలవాటు పడి ఇంకా పేరు పెట్టని ఓ క్రూర జంతువు అంటా రు. కవితలన్నీ కవితల్లాగా లేవు. మనకు శ్రీరాములుగారు నాలుగు మంచి మాటలేవో చెబుతున్నట్లు గా వుంది.

హైదరాబాదులో నేనున్న ఓ గది అంటూ ఒక రచన. పేరు కనురెప్పలు కొట్టని కిటికి అంటూ రాసారు. జనన మరణాల మధ్య అన్నీ జీవించే వున్నాయ్, ఎల్ల ప్పుడూ జీవిస్తూనే ఉంటాయ్, వాటి మధ్య మనమే వస్తువులై వస్తుంటాము, ఇస్తూ అప్పగిస్తూ, సమర్పిస్తూ పోతుంటాము, ఏది వున్నా లేకున్నా బతుకు జరిగిపో తూనే వుంటోంది అనడంలో జీవితానుభవం తొణికిసలాడింది.

నాకు నేను వ్యసనమైతేగానీ ఇలా కవిత్వమై మీ ఎదుట నిలు చుందును అన్న మాటల్లో నిజా యితీ వుంది అనిపించకపోదు. **'నేను కవిత్వం కానిదెప్పుడూ' 'నేనొక ఏకాంత సైన్యం' 'పసిపా పలు దీర్ఘ కవితలే,** లు కూడా ఇదే ధోరణిలో సాగిపోయాయి. నాకు నచ్చిన మరో అంశం ఈ పుస్తకం లో ఏమిటంటే కవితలకు ముందు మాటలుగా 42 పేజీల్లో రాసిన విషయాలను చదువుతుంటే మన యక్కలూరి శ్రీరాములుగారి ప్రతిభా విశేషాలను తెల్సుకుని ఎంతగానో పరవ సించిపోతాము. చాలా గొప్పగా అక్షరీకరించారు.



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

పుస్తక సమీక్షలు

# నండూరి రామకృష్ణమాచార్య 'మహోన్నత సాహితీ ప్రస్థానం'

**"ఎలమి డెబ్బదేండ్లకు పైన ఏకధాటి**
**పద్య రత్నములో నృజియించి ప్రణుతి కెక్కి**
**నట్టి 'నండూరి రామకృష్ణా'ఖ్య సుకవి!**
**మహిని వద్యమ్మునకు నీవు మారుపేరు!"**

అంటారు డా॥ ఆచార్య ఫణీంద్ర. తన గురు దేవునికి సమర్పించిన పద్య నివాళిలో. నండూరి గోవిందరాజు ప్రధాన సంపాదకులుగా, నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం, నండూరి వారి 'సాహిత్య జీవిత ప్రస్థానం' ఉద్గ్రంథంలో, నండూరి వారి స్వీయ సాహిత్య జీవన ప్రస్థానం, ఆత్మకథగా చదువరులను ఆకట్టు కుంటోంది. ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీచే నూతన సాహితీ సనా తనునిగా ప్రశంసలందుకున్న రామ కృష్ణమాచార్య, సాహితీ జీవితమే వ్యక్తిత్వంగా ఆధునిక తెలుగు సాహి త్యాన్ని ప్రభావితం చేసింది. మేధస్సు లో మార్మ్, హృదయంలో బుద్ధుడు, కరుణాత్మక విప్లవ దృష్టి, విశ్వ పౌరు నిగా, మానవతా ఆదర్శంతో నూతన జగతిని ఆకాం క్షించిన రామకృష్ణ మాచార్య జీవన ధర్మం ఉయ్యాల ఊపుగా సాహితీ ప్రపంచాన్ని అలరిం చింది. విద్వత్కవిగా **"కవి వెడలె రవి తేజము లలరగ"** అన్నట్టు గా వారి జీవన గమ్యం లో కవితా కిరీట ధారిగా, తెలుగు వాఙ్మయ చరిత్రలో సంప్రదాయ పద్య సాహితీ సభాప తిగా సుప్రసిద్ధులైనా, ఆధునిక సాహి తీ ప్రియం భావుకునిగా, కొత్త పా తల మేలు కలయికగా పద్య కవితకు పట్టాభిషేకం చేసిన నూత్న యుగోదయ ప్రగతి ప్రభావాలను




ప్రతులకు:
నండూరి గోవిందరాజు
ఫ్లాట్ నెం.423 రాజ రాజేశ్వరి నగర్, కొండాపూర్
హైదరాబాద్=500084
సెల్:9440495887
9391028231

పద్య, నాటక, గేయ సమన్వ యంతో విరాజిల్ల చేసారు. **"నేను సదా సమన్వయవాదిని. హృద యాంతరాళంలో వ్యాస మహర్షికి, తిక్కనకు, కబీర్‌కు వెన్నెల దేవళం కట్టుకున్న వాడను"** అన్నారు. రాష్ట్ర స్థాయి ఆంధ్ర పద్య కవితా సద మ్ముకు అధ్యక్షుడైన రామ కృష్ణమా చార్య **"ఎంత మంది చెమట? ఎందరి నెత్తురు? పీల్చు కుండ ఎవడు పేర్చె ధనము? దొరలు చేసినట్టి దోపిడీయే ఆస్తి, అంతరిం పవలయు= ఆస్తిహక్కు"** అన్నారు. విప్లవ కవిగా ప్రగతి గీతంలో. ఎన్. టి.ఆర్ వీరిని అధికార భాషా సం ఘ అధ్యక్షునిగా నియ మిం చారు.హైదరాబాదులో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో మా తెలుగు తల్లికి పాట పాడేం దుకు లండన్ట్ నుండి టంగుటూరి నూర్యకుమారిని ఆహ్వానించిన్నల్: 9440664610 నిర్వాహకులకు, పాట రచయిత కవి సుందరాచారిని వెంకట పెట్టుకొని తీసుకుని వెళ్ళిన అదృష్ట అవకాశం, నండూరి రామకృష్ణ చార్యుల హృ దయ సంస్కార ఔన్నత్య భావనను వ్యక్తపరిచే సంఘటనలు ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి.

ప్రాచీనత, నవ్యతల మధ్య ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాల మధ్య సమన్వయకర్తగా నూత్న జగతి ఆకాంక్షించిన మహా కవి రామ కృష్ణమాచార్య.

**"మంచివాడ ననెడి మాట చాలును నాకు**
**మరణమందు పిదప ధరణి మీద**
**మేటి కవినిగా=మేధావిగా గాని పేరు చెంద నేను కోరుకొనను"**

అన్నారు బహిరంగ స్వగత పద్యావళిలో.

ఈ గ్రంథంలో డా॥ విజ మూరి లక్ష్మి ఇంటర్వ్యూ శిష్టా వేం కట రావు ప్రశ్నలకు యువ కవి, ప్రియ శిష్యుడు ఆచార్య ఫణీంద్ర ముఖాముఖి, నండూరి వారి హిమాలయోన్నత పాండితీ వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని సుస్పష్టం చేస్తున్నాయి. నండూరి గోవింద రాజు, ఆత్మకూరి గాంధీ, డా॥నం దూరి నిత్యారణ్య స్వామి, నండూరి వేద వ్యాస చక్రవర్తి గ్రంథ సంపాదక వర్గానికి, సాహిత్య పీఠం నిర్వాహకులు కళ్ళెపు సాగరరావు, ఆచార్య ఫణీంద్ర, వేకురాజు విజయ్‌కుమార్, నండూరి రామకృష్ణ, వందలాది రచయితలు, శిష్యులు, ప్రశిష్యులు, కుటుంబ వారసులు ఈ గ్రంథ సత్కృషికి అభినందనీయులు.



–జయసూర్య



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.
ఈ వారం వచన కవితల వర్క్ షాప్...అంశం "లంచం". విజేతల కవితలు చదవండి
–సంపాదకులు

–డా॥రావి రంగారావు
9247581825

## "లంచం"

లంచమంటే..
రహ దారుల్లో నడిచే
సింహం కాదు
చీకటి దారుల్లో దూరే నల్ల పేను.
లంచమంటే..
ఫైలును మూసి పెట్టి
కాలయాపన చేస్తూ
కాళ్ళు అరిగేలా తిరిగినా
కరుణించని కఠిన శిల...
లంచమంటే..
కష్టపడితే వచ్చే అన్నంలో దూరి..
కన్నీటి కడగండ్లు నాకే పిచ్చి కుక్క.
లంచమంటే..
తండ్రి కర్మకాండలకు
దాచుకున్న కట్టెలను
సైతం తొలిచే చెదలు
లంచమంటే..
దేవుని గుడిలో
కర్పూర దీపం వెలిగించి..
పేదల కంట్లో కుంపటి రాజేసే
రాక్షసి.
లంచం అంటే..
శవాలకు వైద్యం చేసే
కార్పొరేట్ ఆసుపత్రి..
నల్ల అంబులెన్సులో
సాగనంపే మసక బారిన
తెల్ల కోటు.
లంచమంటే..
ఏదని చెప్పాలి?
ఎక్కడ లేదని చెప్పాలి?
ఏ ఆఫీసు తవ్వినా
పుట్టలు పుట్టలు తేళ్ళు..
ఇంకా మంద్ర గబ్బిలు.
అచేతనం చైతన్యం కావాలి
నిరాయుధం ఆయుధం పట్టాలి
పిడికిలి విప్లవ రూపం కావాలి
లంచావతారం పారి పోవాలి.

–పగడాల వెంకటరెడ్డి
7993422614

## బోనులో ఎవర్ని నిలబెడదాం!?

స్వార్థం పునాదులపై నింగిని తాకుతూ
మేడల్లా విస్తరించిన అధర్మ ఆర్జనం.!
ఏ రంగం చూసినా పార్థీనియం లా అల్లుకుపోయిన పాపం..!
దయా దాక్షిణ్యాల తలుపులు మూసేసి
కక్కుర్తి జేబుల్ని నింపే వక్రభాష్య లాంఛనం!
అమాయకులకు అందలాల నిచ్చెన చూపి
దాగుడు మూతలతో దండుకునే చేతివాటం!
న్యాయం ముసుగులో ఎక్కే ప్రతి మెట్టుపద్ద
నల్లకోటు ముట్టజెప్పించుకునే ముడుపు..!!
ఉపాధి అవకాశాల బోర్డులు కడుపుబ్బా
వడ్డించమనే కక్కుర్తి ఆమ్యామ్యాలు..!!
పురిటి ఒడిలో పోసుకొనే ఊపిరి
మట్టి ఒడి చేరే తుదిశ్వాస
చేతుల్ని తడపాల్సిన ఉపచారం..!!
ఉనికి నిలబెట్టే ఆధార్
ఊపిరి లేదని నిరూపించే డెత్
సర్టిఫికెట్ ఇతోధికంగా దక్కించుకునే వాటా!!
జీవిత కాలం కూడబెట్టిన కష్టార్జితము మలి సంధ్య
ఖాతాలో పడేందుకు పంచాల్సిన పన్నారం!!
అధికార దుర్వినియోగంలో అందదందై
దొడ్డిదారిలో దూరే వారికి బార్లా తెరిచిన వాకిలి!
అవసరాన్ని పసిగట్టి , అదను చూసి
సంధించే నిస్సిగ్గు అస్త్రం..!!
యిచ్చిన వారిలో ఇంగితం తొలగించి
పుచ్చుకునే వారిలో అత్యాశ నాటిన విషబీజం!!
సమాజాన్ని నిజాయితీ అద్దం ముందు నిలబెడితే
విద్దూరంగా కనిపిస్తోంది ద్విముఖ చిత్రం..
విచారణ బోనులో ఎవర్ని నిలబెట్టాలో
తేల్చుకోవలసింది మాత్రం మనమే!!

–అమృతవల్లి అవధానం
9052912120.

## అసలు రంగు

పురాణాల్లో మెరిసి
చరిత్రలో విరిసి
కాలచక్రంలో నడుస్తూ
మేరువును తాకుతూ
పాతాళాన్ని స్పృశిస్తూ
అష్టదిక్కుల్నీ గుర్రపు
డెక్కలా అల్లేస్తూ...
రంగూ,రుచీ
వాసనా, ఆకారం
లేనిది ఆ వింతఫలం
ప్రతిఫలం రూపంలో
చేతులు మారుతూ
ఎందరెందరిన
ఏమారుస్తూ...
మాయల్ని నమ్ముకుని
మర్మాల్ని కమ్ముకుని
ఏ పాత్రలో దూరినా
దానిలో ఒరిగిపోతూ
ఏమెరుగని నంగనాచిలా
నీతి ముసుగులో



చరిస్తూ..
ఒకచేయి తడుస్తుంటే
మరో గుండె బీటలువారుతూ
ఒక ఇంట్లో దీపం వెలగాలంటే
మరో ముంగిట్లో చీకటి
వాలుతూ
నిజాయితీ రక్తాన్ని
జలగలా పీల్చి
వ్యవస్థని తెల్లబోయేలా
చేస్తున్న దీని అంతరంగం
మాత్రం నలుపే....
దయా దక్షిణ్యాలు లేని
ఆ స్వార్థపు మాయావిని
అంతం చేయాలంటే
నిర్భయత్వ కవచాలతో
అవగాహనా ఆయుధం పట్టి
నిజాయితీ చురకత్తులు గా
మెలగాల్సిందే..

–మేడిశెట్టి సుభద్రా కృష్ణ
7396959347

## తోబుట్టువు

స్వార్థానికి మరోరూపు,
అవినీతికి అసలురూపు,
ధన దాహార్తికి లేదు అలుపు...
చేతులు మారిన డబ్బుకి
అందల మెక్కిన సంబరంలో
పండుగలే..
కంటి కడలిని మునిపంట
అదిమిన ఎందుడొక్కలతో
ఏంపనిలే!!.
మనిషి పుట్టుకతోనే
పుట్టుకొచ్చిన లంచం
తోబుట్టువుకిందే లెక్క!
బర్త్, బెర్త్, ఎర్త్
క్యాస్ట్, స్టడీ,డెత్
పేరే వేరు.. ఒకే తీరు!.
అసలు మనిషి చాలా గొప్పోడు
దేవుడికి కూడా లంచమిస్తాడు!!.

–రాయసం. గిరిజారాణి
9849917675

# రక్తపాతం - హింస మాత్రమే నేటి నిజం

ఇది పండుగల సీజన్ కదా – వరుసగా సెలవులు వచ్చాయి. అందుకని నేనూ – అన్య – విడూలం చాలాకాలం అయింది థియేటర్లో సినిమాలు చూసి, మూడు నాలుగు సినిమాలు చూద్దాం అనుకున్నాం. అందులో తెలుగు సినిమాలు ఉన్నాయి. డబ్బింగ్ సినిమాలు ఉన్నాయి. ఎవరికి వారు మాకు కోట్లాది రూపాయల ఓపెనింగ్ కలెక్షన్స్ వస్తున్నాయని ప్రకటించుకుంటున్నారు. దానికి ముందు ఆ సినిమాలకు వందల కోట్లు ఖర్చు పెట్టాం కాబట్టి ధరలు పెంచాలంటున్నారు. దాని మీద గొడవలు, కోర్టుల కెక్కటాలు, చివరికి ఎంతో కొంత పెంచుకోవటం జరుగుతూనే ఉన్నాయి.

"మనం ఇంటి దగ్గర టీ.వీ.లో అన్ని భాషల సినిమాలు చూడవచ్చు. థియేటర్ కి వెళ్ళటం అవసరమా" అంది అన్య.

"ఎంతయినా పెద్ద తెర పెద్ద తెరే అన్యా – ఆ సౌండ్ ఎఫెక్టులు, ఆ దృశ్యాలు చూస్తే వచ్చే మజా వేరుగా ఉంటుంది. ముందు అక్కడ వందల మంది జనం ఉంటారు. మధ్యలో వారి ఫీలింగ్స్ ని కూడా చూడటం మంచి అనుభవం కదా!" అన్నాడు విడూ.

"అవును. ఒకప్పుడు టీ.వీ.లు లేవు. అందరితోపాటు సినిమాలు చూస్తుంటే వచ్చే మజా గురించి మా తాత చెప్పేవాడు. ఒక్క సినిమాలే కాదు – నాటకాలు, బుర్ర కథలు – హరి కథలు, తోలు బొమ్మలాటలు ఏదైనా అద్భుతమే. అలాంటి రోజులు తిరిగి రావంటారు. కొన్ని సినిమాలకయితే ఎడ్ల బండ్లు కట్టుకుని పల్లెల నుండి పట్నాలకు వెళ్ళేవారంట" అన్నాను.

"సరే మీ ఇష్టం. ఇంటర్వెల్ లో స్నాక్స్ కూడా కావాలా" అంది అన్య.

"సినిమా మొదలవగానే మన చేతుల్లో కూల్ డ్రింక్, పాప్ కార్న్ ఉండాలి" అన్నాడు విడు. అవన్నీ వాడే స్పాన్సర్ చేస్తానని కూడా చెప్పాడు.

అలా మేం ముగ్గురం సినిమాకు వెళ్ళాం. మిస్టర్ క్లీన్ గారిని కూడా తీసుకువెళ్దామా అనిపించింది. 'పెళ్ళికి పోతూ పిల్లిని చంకన పెట్టుకుని వెళ్దామా' అని అన్య అంటుందని శంక కలిగింది. అయినా థియేటర్ లో సినిమా చూడాలని మీకు ఎవరు చెప్పారా అంటాడేమోనని అనుమానం వచ్చింది.

సినిమా మొదలయింది. దాని పేరు ఏంటి అని మీరు అడగవద్దు. అది కేవలం పెద్దలకు మాత్రమే. మమ్మల్ని లోపలకు రానిస్తారా అనే డౌట్ వచ్చింది. అడ్డగించి నవారు లేరు. సినిమా చూస్తుంటే మా తాతగారు చెప్పే జోక్ ఒకటి గుర్తు వచ్చింది. అదేదో కౌబాయ్ సినిమా అంట. గుర్రాలు, తుపాకులు, కత్తులు విసురుకోవటాలు, ఆ సందర్భంగా వివిధ భంగిమల్లో రెచ్చిపోతు న్నారు. మా తాత ఇలాంటి సినిమాకు ఎందుకొచ్చావ్రా దేవుడా అనుకుని సిగరెట్ తాగటానికి బయటకు వెళ్ళాడంట. ఇప్పుడు మానేశాడులెండి.

పది నిమిషాల తర్వాత వచ్చి – పక్కనున్న ప్రేక్షకుడితో –

"కథేం జరిగిందండి" అనడిగాడు.

"ఓ వందమంది చచ్చారు" అన్నాడా




– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

ప్రేక్షకుడు. మా తాత నవ్వలేదు. బిగుసుకు పోయాడు. ఎవడు ఎందుకు వస్తాడో, ఎందుకు చంపుతాడో తెలియదు. మధ్యలో గాయబ్ – మా తాత!

ఇదిగో ఈ సినిమాలోనూ అంతే. కత్తుల్తో నరకటాలు – గొంతుల్ని కోయటాలు – బాంబులు విసరటాలు – తెర మీద రక్తపు కాల్వలు. ఇది ప్రపంచ యుద్ధం కాదు. కళింగ యుద్ధం కాదు. ఫ్యాక్షన్ అంట. మాఫియా అంట. రివెంజ్ డ్రామా – మతపరంగా చెప్పాలంటే జీహాద్ లంట. మారింది ఒకటే – హీరో మేకోవర్లు – టైమ్ పిరియడ్లు. ఇంటర్వెల్ అయింది.

"ఈ భాగ్యం కోసం ఈ సినిమాకు తీసుకువచ్చారా? వీళ్ళు అన్నంలో కూరలు కలుపుకు తినరనుకుంటా. రక్తం కలుపుకుని తింటారు. ఆ గంతులేంటి? ఆ ముద్దులేంటి? ఛీ..ఛీ...ఛీ.. ఇది సినిమానా. ఇన్ని వందల మందిని చంపుతుంటే పోలీసులేరి.. చట్టం ఏది – కోర్టులేం చేస్తున్నాయి" అంది అన్య.

"సినిమాలకు లాజిక్కులు అడిగేవారిని వెధవలు అంటారు. అవన్నీ వినోదం కోసం – వినోదానికి తర్కం అవసరం లేదు. ఎంజాయ్ చేయటమే" అన్నాడు విడు.

"రక్తంతో ఎంజాయ్ చేయటం ఏంటి విడూ – ఇవేమైనా విరలాచార్య సినిమాలా లాజిక్కులు అడగకపోవటానికి. మీరు ఎం జాయ్ చేయండి. నేను మీ తాతలా గాయబ్" అని పిలుస్తున్నా వినకుండా వెళ్ళిపోయింది.

తర్వాత నేనూ – విడూ ఇంకో రెండు సినిమాలు చూశాం. ఒకదాన్ని మించింది మరొకటి – టన్నులకు టన్నుల రక్తపాతాలు. హింసకు పరిమితి లేదు. ఇవన్నీ చూడటం మాని ప్రేక్షకులను చూడటం మొద లుపెట్టాను.

కొంతమంది మహా ఎంజాయ్ చేస్తున్నారు.

అంటే ఈ సినిమాలు రేపటి హంతకుల్ని – మాఫియాలను తయారు చేస్తున్నాయి. సమాజంలో ఇంకా భయంకరమైన హింస ఉంది. మేం తెర మీద చూపిస్తున్నది నాలుగో భాగమే అంటున్నారు సినిమా వాళ్ళు.

మళ్ళీ మేం ముగ్గురం సమావేశం అయ్యాం.

ముగ్గురు హీరోల పేర్లు చెప్పింది అన్య.

"వీళ్ళు ఇంతకుముందు కుటుంబ చిత్రాల్లో చేసేవారు. వాటిలో కూడా ఒకటో అరో ఫైటింగులు ఉండేవి. అందులో కొన్ని చక్కగా ఆడాయి. ఇప్పుడు మేకప్ వేసుకున్న ప్రతివాడూ పాన్ ఇండియా స్టార్ కావాలనుకుంటున్నాడు. ఛాన్స్ దొరికితే ఇంటర్నేషనల్ స్టార్ అవ్వాలనుకుంటున్నారు. ఇప్పుడు పాన్ ఇండియా అంటే రక్తపాతం. హింస. ఇవే కదా దేశాన్ని నడిపిస్తోంది. నేను కనక ఇండియాకు ప్రధానమంత్రి అయితే ఇలాంటి సినిమాలను నిషేధిస్తా" అంది ఆగ్రహంగా అన్య.

"అప్పుడు నిన్ను ఈ లోకం నుండి నిషేధిస్తారు" అన్నాడు విడు.

"దేశం చెడిపోయిందని తెలుసు. ఇంతగా చెడిపోయిందని ఇప్పుడు మరింత క్లియర్ గా అర్థం అయింది" అన్నాను.

"దేశం మాత్రమే కాదు. ప్రపంచం మొత్తం చెడిపోయింది మేంగో. అందుకే ఎటు చూసినా ఇవే దృశ్యాలు. ట్రంప్ లూ, ఇరాన్ లు, రష్యాలు, ఉక్రెయిన్ లు, ముస్లిం కంట్రీస్. ఇలా ఒకటా రెండా అన్నీ ఈ హింస గూటిలో బంధించబడ్డాయి. అసలు ఈ రోజున ప్రజలెవరైనా ప్రశాం తంగా గుండెల మీద చేయి వేసుకుని హాయిగా నిద్రపోగలు గుతున్నారా? అం దుకేగా కోవిడ్ లు, ఎల్ నినోలు మనుషుల మీద విరుచుకుప డుతున్నది" అంది అన్య బాధగా.

"ఇలాంటి సమయంలో కూడా చిన్న రాష్ట్రాల దగ్గర్నుంచి పెద్ద దేశాల దాకా కలిసి హాయిగా నవ్వగలుగుతున్నారా? కరువు తీరా ఏడవగలుగుతున్నారా? ఏకం గా నిరసన తెలపగలుగుతున్నారా? మనం ఇంత టెక్నాలజీని సాధిస్తున్నా కులాలుగా, మతాలుగా, ప్రాంతాలుగా ఛిద్రం అవుతు న్నాక, ఇంక భవిష్యత్తు ఉండదు. ఈ అరా చకం ఇలా కొనసాగు తుండాల్సిందే. కనుచూ పుమేరలో ఆశా కిరణాలు కనిపిం చటం లేదు. బతికినంత కాలం ఏదోలా బతికి – ప్రకృతికో – మను షులు సృష్టించే ప్రళయాలకో బలి కావల సిందే" అన్నాను. ఎవరికయినా రేపటి మీద ఆశ ఉంటే వారు నవయుగ దూతలే!

## ఉషోదయం చేతులు చాచింది

ఇప్పుడు అంత కొత్తగా ఉంది
మనసు నిర్మలమైన పూదోటలో
రెక్కలు విచ్చుకున్న సీతాకోకా చిలుకలా
కొత్తదనం కోరుతూ విహరిస్తుంది
ఆమె మౌనంగా చూసిన చూపులకే
ఇన్ని భావాలు ఒలకబోస్తూ..
అష్టపంకర్లు తిరిగితే ఇంకేమైనా ఉందా
ప్రకృతి అంతా నవ్వింపోదు ..
ఆకాశంలో జాబిల్లి ఆ తారల మధ్యన
వికసించాడు నువ్వు అటు చూశావో లేదో
ఆ నాలుగు గోడలను బద్ధలు కొట్టుకురా
చీకటి తొలిగే రోజు
ఎలా ఉంటుందో చుద్దువుగానీ
అయినా నువ్వు ఎప్పుడూ కలలోనే కరిగిపోతే
నేను నిన్ను ఎలా నా మనో నేత్రంపై
బంధించ వీలుంటుందో ఆలోచించావా
కనీసం తెల్లవారే వరకు ఆగాలేవా
నిన్నటి దుఃఖం ఎంతకాలం మోస్తావు అని
ఉషోదయ వేల చేతులు చాచి ఆనందం
మన జీవితంలో నింపుతాను
అక్కడే ఉండండని
సూర్యుడు నిన్ననే చెప్పి వెళ్ళాడు
ఆయన నువ్వు ఎక్కడా అని వచ్చి అడిగితే
నేను ఏమని చెప్పాలో నువ్వే చెప్పు
కనురెప్పలు తెరిస్తే మాయమవుతావు
ఆయన తలుపు తట్టే వరకు
నేను ఇక్కడే
ఈ ప్రేమతోటలో తిరుగుతూ
వుంటాను



– వజ్జీరు ప్రదీప్
9989562991

## నానీలు

**డబ్బులున్నాయా...!**
చాలు చాలు
జైలు గదులు
విల్లాలవుతాయి!



-అవ్వారు శ్రీధర్‌బాబు
సెల్:8500130770

**పుట్టుకే జననం**
**అంటే ఎట్లా..!**
**కొందరి మనసుల్లోనైనా**
**నీవు పుట్టాలిగా.**

**గొంతుక తడుపుతూ**
**నది**
**దాని గొంతుక కోసే**
**ప్రయత్నం మనిషిది.**

**ధరలు**
**కళ్లెం విడిచిన గుర్రాలైనాయి**
**బీద రౌతు**
**ఎన్ని పాట్లు పడాలో...!**

**సూర్యుని**
**ఎంత పుణ్యమో కదా!**
**ప్రతి రోజు**
**సముద్ర స్నానమే..!**

నాటి తరం వారి కథలు నేటి తరానికి

## కథల వంతెన



1975లో రాసిన కథ

# స్వర్ణ శృంఖలలు

(కథ)



- కూర చిదంబరం
సెల్: 8639338675

"టక్! టక్! టక్!" వారి కాలి జోళ్ళ ధ్వనులతో ఆ రహస్య గుహాంతర్భాగాలు ప్రతిధ్వనిస్తున్నాయి. అప్పుడప్పుడు యమునా నది సైకతాల మీద విశ్రాంతి తీసుకుంటున్న పాదపాలచప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం. కరదీపిక సహాయంతో ముందు సేవకురాలు నడుస్తుంటే వెనకే మరో వ్యక్తి నడుస్తున్నాడు.

క్రమంగా చీకటి సన్నగిల్లి వెలుతురు వచ్చింది. నిశ్శబ్ద నిశి రాజ్యంలో రేరాజు ప్రశాంతంగా నిద్రపోతున్న వేళ... పద కొండు గంటలు కొట్టారు.

ఇద్దరూ ఓ పాలరాతి భవనంలోకి వెళ్ళారు. సుగంధ పరిమళ భరితము శోభాయమానాలం కృతమైన ఆ భవనంలో చీకటి చిన్నగా పారాడుతున్నది. ఆవలి ప్రక్క జలతారు, తెరల్లో ఏదో అస్పష్టాకారము కన్పించింది.

"జలీల్! దీపం పెద్ద గా చెయ్" కోకిల కంఠంలోంచి తేనె సొనలు కారుతున్నాయనిపించింది. అప్పుడప్పుడే విచ్చిన మల్లెలాంటి సువాసనలు గుబాళించే సౌందర్యం, గల యువత జలతారు పరదాల నొత్తిగిల్లుకొని ముందుకు వచ్చింది.

మహారాణి...!

క్షణకాలం మోహన్‌చంద్ ప్రాణప్పడిపోయాడు. 'రహస్యంగా, పాదుషావారికి తెలీకుండా, ఈ రాత్రి పిలిపించడంలోని అంతర్యమేమిటి? ఏమైనా వెలగల రత్నాల అవసరం వచ్చిందేమో..."

"కూర్చో మోహన్‌చంద్" మాటలు మధురంగా ఉన్నాయి.

"ఎందుకులే జహాఁపనా" మాటల్లో తడబాటు స్పష్టంగా కనిపిస్తున్నది. సిగ్గు, భయంతో తలెత్తి చూశాడు మోహన్‌చంద్. గులాబి నూనె దీపశిఖలో మనోహరంగా కనిపించింది. జలతారు దుస్తుల్లోంచి అవయవాల పొందిక చాలా స్పష్టంగా కనిపిస్తున్నది.

"ఏలినవారు కూర్చోమన్నారు" జలీల్ రాణివారి హోదాను గుర్తుకు చేసింది.

కొంచెం కదిలిందేమో తలపైన పర్షియా టోపీకి పొదిగిన గోమేధికాలు, మెడలోని పచ్చలతోబాటు ఒక్కసారి తళుక్కుమని మాయమయ్యాయి.

అభిముఖంగా ముఖమల్ దిండ్లతో కూర్చుండీ కూర్చుండనట్లు కూర్చున్నాడు మోహన్ చంద్.

చిన్న సైగతో ద్వారబంధనం చేస్తూ జలీల్ నిష్క్రమించింది.

దీపకాంతి బలవంతంగా మోహన్ చందు చెక్కిలి నొక్కసారి మీటింది.

క్షణం వరకు నిశ్శబ్దం..

"రహస్యమా జహాఁపనా" అతురతా ఆదుర్దా తొంగి చూస్తున్నాయి ఆ ప్రశ్నలో..

మాట్లాడలేదు. క్షణమాగి, "సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలీడం లేదు. మోహన్‌చంద్!" ఏదో అవ్యక్తాగమమైన భావం నిబిడీ కృతించబడిందా మాటలో.

తేలికగా నిట్టూర్పు పుచ్చాడు మోహన్ చంద్.

"భగవాన్! భ్రతికిపోయాను" అనుకుని.

"వ్యాపారం ఎలావుంది?" మాట పూర్తికాకముందే జలీల్ తలుపు త్రోసుకుని వచ్చింది. చేతిలో అందమైన బంగారు పళ్ళెం. దాంట్లో సురా పాత్ర, చషకాలు కూడా ఉన్నాయ్. ముందుంచి రెండు చషకాల్లో పోసింది. సన్నటి రక్తవర్ణ ధార... లతాంగి సామీప్యాన్ని గుర్తుచేస్తున్నాయి.

"తీసుకో మోహన్‌చంద్" మొదటిది ఖాళీ చేసిందేమో గిన్నెను పళ్ళెంలో పెట్టింది. జలీల్ వినయంగా చషకాన్ని పట్టుకుని ముందు నుంచుంది.

"పద్దండి జహాఁపనామ్!" అభిలషించని ఆదరణ అందుకోడానికి ఎవరైనా వెనుదీస్తారు.

"త్రాగు మోహన్‌చంద్"

"మహారాణీవారి ఆజ్ఞ"

మాటలన్నీ భౌతికంగా చెవుల్లో దూరు తున్నాయి. కాని మనసంతా దూరంగా భవిష్యత్తుపై కేంద్రీకరించబడింది.

క్షణాలు ఘడియలు ఎన్ని గడిచిపోయాయో తెలీదు మోహన్ చందుకు. కాని సుఖమల్ ఉత్తరీయం, నుదుట పట్టిన ముత్యా ల్లాంటి చెమట బిందువులను కబలిస్తున్నది.

గ్లాసు మీద గ్లాసు, మధువును ఖాళీ చేసింది మహారాణి. కళ్ళు కైపుతో ఎర్రబడ్డాయి. 'జలీల్ నువ్వెళ్ళవచ్చు.."

"చిత్తం హుజూర్!" జలీల్ వెళ్ళిపోయింది.

"మోహన్‌చంద్"

"....."

"నీ కళ్ళకు అందవతిగా కనిపించేదెవరు?"

పై షాండిలర్ కూలి తలపై పడ్డట్ల నిపించింది. మోహన్ చందుకు. ప్రశ్నలోని అంతర్యం ఏమిటి? రత్నాల్లో ఈ అందాన్ని ద్విగుణీకృతం చేయాల్సి ఉందా?" అని ఆలోచించసాగాడు.

"మాట్లాడవేం చంద్! నేనందంగా లేనా?"

మొఖం మీద కొరడా ఠపీమని ఝళిపించినట్లయింది. పైనున్న గాజుబుడ్డిలోని కిరణాలు, బాణాలై హృదయంలోనికి దూసుకు పోయాయి.

పవిత్ర హిందువును అలా పరాయి ఆడది అడిగితే ఏమని సమాధానమివ్వగలడు? గరిక పచ్చడి పసందు చేసే కోటీశ్వరుడుంటాడా?

"మాట్లాడవేం మోహన్‌చంద్?"

హజారాలో పన్నెండు గంటలు కొట్టినట్లు సన్నగా వినిపించింది.

"మీ అందానికేం జహాఁపనాఁ అందు వల్లనేగదా పాదుషావారి నాకర్షించారు. పట్టపురాణీగా, ముఖ్య సలహాదారులుగా ఉన్నారు."

వినయం, బయం దాచుకున్నా దాగడం లేదు.

"అయితే నీకూ నేనందంగానే ఉన్నానన్నమాట" కళ్ళు రక్తగోళాలవడం గమనించాడు.

"రాణీవారు స్వాధీనాన్ని కోల్పోతున్నారు" అనుకున్నాడు మోహన్‌చంద్.

"మోహన్‌చంద్.." మగతగా అరమోడ్పుగా ఉన్నాయి కళ్ళు. మత్తు, మైకం ధ్వనిస్తున్నాయి మాటల్లో. కుప్పలా మోహన్‌చంద్ కూర్చున్న దిండ్లలో కూలబడింది.

ఒదిగి కూర్చున్నాడు మోహన్‌చంద్ ఓ మూలకు. వారి తలలపై నున్న గాజు బుడ్డిలలోనున్న దీపకాంతి, వారి మధ్యనో తెరలాగా చీకటిని పరచింది.

"మోహన్‌చంద్"

...

"నిజంగా నీవు మన్మథుడివేనోయ్. ప్రప్రథమంగా, సభకు వచ్చినప్పుడే నేనీమాట అనుకున్నాను. దినదినానికీ నాకీ కోరిక ప్రబలిపోయింది. నిజంగా నీ భార్య ఎంత అదృష్టవంతురాలో.."

"మహారాణీవారు.. హద్దు మీరుతున్నారు" అనే మాట గొంతులోనే ఆగిపోయింది. పైకి పెగల్చడానికి ధైర్యం లేదు. సింహాన్ని చూసిన లేడీకి పరిగెత్తడానికి కాళ్ళు కూడా రావు.

అణిగివున్న మోహన్‌చంద్ మీదికి ఆకస్మాత్తుగా వొరిగిపోయింది. కప్పపైకి పాము విరుచుకుపడింది.

గ్లాసు త్రాగినా సుర సురే..

"మోహన్‌చంద్! ఇన్నాళ్ళకు నా కోరిక నెరవేరింది. నా కలలు ఫలించాయి. నా తనువు తరించింది" ఇంకా ఏదో అస్పష్టంగా అంటూనే ఉంది. కృష్ణ సర్పం మండూకాన్ని చుట్టేసుకుని నాలుకతో స్పర్శిస్తున్నది.

పైకొరగిన ఆమె అధరాలు మోహన్‌చంద్ చంపను, పెదాలను మృదువుగా నొక్కాయి.

గ్లాసుడు నిసా యావత్తూ దిగింది మోహన్‌చందుకు.

అది పాపం.. వర్ణ సంకరం.. జాతి ద్రోహం.. స్వామి ద్రోహం.. చేతులు మెల్లగా భుజాలపైకి లేచాయి. పరిష్వంగాన్ని పటిష్టం చెయ్యడానికేమో.

కాదు...

నీతి, నియమం, హద్దు, ధర్మం, న్యాయం ఇంకా ఉంది. అది పోదు కూడా.

ఆమె కుప్పలా నేలమీద పర్చిన టర్కీ తివాచీ మీద పడింది.

ఆకస్మిక సంఘటనకు నిశ్చేష్టురాలైంది. తిరస్కరిస్తాడనుకోలేదు. మొదట నసిగిన. తర్వాత లొంగిపోతాడనుకుంది. కొసప్రాణంతో ఉన్న దీపశిఖ నార్పివేయడానికి ఎంత సేపు.

నాగినిలా లేచి నిల్చుంది. కళ్ళు గోళాలయ్యాయి. అధరాలు వ్యధించిపోతున్నాయి. "మోహన్‌చంద్! నన్నిలా అవమానపరుస్తావని కలలో కూడా అనుకోలేదు" అహంకార జ్వాల బుసకొట్టింది.

"మీకిది తగదు మహారానీ" కళ్ళలోకి చూడలేకపోయాడు. "ఖామూష్! రాజాధికారాన్ని ధిక్కరించేవాడివయ్యావన్నమాట." గట్టి ఉచ్ఛ్వాసకు పాములా పొంగిపోయింది. "హుం ఎంత నిర్లక్ష్యం, ముత్యాన్ని నేలకు కొట్టే మూర్ఖుడుంటాడా? మళ్లెను వలదనే మందుడుంటాడా? ఏం అంత పొగరా" చూపులు నాగుపాము కాట్లయ్యాయి.

ఇంతవరకూ మోహన్‌చంద్ మస్తిష్కంలో భయాందోళనలు తెరవడ్డాయి. కాని ఇప్పుడవి తొలిగిపోయాయి.

"జహాఁపనా, నా హృదయం స్వచ్ఛ దర్పణం. ఒకసారి ఒకరి నీడపడిందటే అది శాశ్వత చిత్రమౌతుంది. వార్యుపరితల బింబంలా క్షణభంగురం కాదు. వ్యక్తి కామం కళ్ళు గప్పినపుడు కట్టుతప్పి ప్రవర్తిస్తాడు. కాని నన్ను కామమలా జయింపజాలదు నాగస్వరం ఊదుతుంటే వింటున్న నాగినిలా ఊగిపోతున్నది. పనిచేస్తున్నవి శ్రవణేంద్రియాలు కాని, మేధస్సు కాదు. "ప్రాణంగా ప్రేమించే పాదుషావారున్నారు. దివ్య భోగాలున్నాయి. మీ అంతస్తు వేరు. మా అంతస్తు వేరు. మమ్మల్ని కోరటం తుచ్ఛం.."

యమునానది పై నుండి చల్లనిగాలి "ఠపీ"మని ఇద్దరి మొఖాన కొట్టింది. మోహన్‌చంద్ చల్లబడ్డాడు. మాట్లాడలేకపోయాడు. గొంతు తడారిపోయింది.

వేడికి చల్లదనాన్ని చేర్చితే లోనున్న వేడి కూడా పైకుబుకుతుంది.

"అయిందా ఉపన్యాసం.. మోహన్‌చంద్! బాగుగా జ్ఞప్తికి తెచ్చుకో ఎవరి ముందుండి మాట్లాడుతున్నావో! ఒక చక్రవర్తిణి ఎదురుగా..."

"తెలసు" మాట మధ్యలోనే అందుకున్నాడు. ఆవేశం ఆగటం లేదు. "తప్పు చేయటం మానవనైజం"

"ఖామూష్! బద్మాష్!" ముఖంలో రక్తం పేరుకుంది. ఎరుపు దీపకాంతికి అది మరింత ఎరుపెక్కింది. "ఆడది పామువంటిది తెలుసా?.. మించిపోలేదు ఇప్పటికైనా.. పానుపుపై పరచిన మల్లెలు పూర్తిగా విచ్చాయి. మన కౌగిలిలో అవి నలిగిపోవాలి. నీ కౌగిటిలో నా యవ్వనం సార్థకం కావాలి. పాదుషాలకు అందాన్ని చూడటం తెలుసుగాని ఆస్వాదించడం తెలీదు. మోహన్‌చంద్! పాదుషా ఢిల్లీ వెళ్ళాడు. ఇంకా రెండు రోజులవరకూ రాడు. భయం దేనికి మోహన్‌చంద్?"

"..."

బెట్టు చేయవద్దు మరీ. భ్రతిమాలడానికి ఎవ్వరూ లేరు. పద! శయనాగారానికి" చేయిపట్టి మృదువుగా నొక్కింది. నిప్పు తగిలినట్లు లాక్కున్నాడు.

"వెళ్ళివస్తాను మహారాణీ! రెండు ఝాములయింది. ఇంట్లో కాచుక్కూ చుంటారు."

అగ్నిపర్వతం భ్రద్దలయ్యాక శాంతంగా వుంటుంది. ఇదువరకేమి జరగనట్లే ఉన్నాడు మోహన్‌చంద్. "ఒకవేళ ఇది పాదుషావారికి తెలిసిందా మన తలలు తీయిస్తారు. జహాఁపనా! మీరిలా ప్రవర్తిచటం భావ్యం కాదు. వస్తాను" అంటూ వెనక్కి తిరిగాడు.

"హ్హహ్హహ్హ మోహన్‌చంద్! భలేవాడివే పాదుషాకు తెలుస్తుంది కదూ? వెళ్ళు వెళ్లు ఇంట్లో నీ బేగంగారు కాచుక్కూచుంటారు. త్వరగా వెళ్లవుగాని.. జలీల్.

తలుపు తీసుకొని వచ్చింది జలీల్.

మోహన్‌చంద్ పెదరెక్కలు విరిచి కట్టబడ్డాడు.

×××

**దివానేఖాస్.. కిటకిటలాడుతున్నది, పాదుషావారు ఆసీనులయ్యారు. యమునానది ప్రత్యూష పవనాంకురాలు మందంగా వీస్తున్నాయి. నేరాలను విచారించే రోజు.**

పాలరాతి ఆసనం మీద ఆసీనుడయ్యాడు పాదుషావారు. పన్నీరు వెండి సెలయేరు లాగా, దివానేఖాస్‌ను సురభితం చేస్తున్నది. పాలరాతి పద్మం ఆహ్లాదంగా రంగునీళ్ళు విరజిమ్ముతున్నది. ఒక్కొక్కరు విచారించబడుతున్నారు. పాదుషావారికి చెవులున్నాయి కాని జ్ఞాననేత్రం లేదు.

అస్తాద్రికి చేరిన భానుబింబంలా ప్రవేశపెట్టబడ్డాడు మోహన్‌చంద్. మాసిన దుస్తులు, గెడ్డం, రేగిన తల, వంచిన శిరస్సుతో, తల ఎత్తితే.. రక్తారుణిమలతో ప్రజ్వరిల్లుతున్న కన్నుల నుండి విస్ఫులింగాలు రాలి, పరిసరాల్ని దగ్ధం చేసేవేమో..

"నేరస్తుడు అక్రమంగా ఏలినవారి జనానావేపు ప్రవేశించబోతున్నాడు. రక్షకభటులు పట్టుకున్నారు. అర్ధరాత్రివేల వంటిగా దొంగతనంగా గోడదూకి ప్రవేశించాడనటానికి వంటిమీదున్న చినిగిన దుస్తులు, గీచుకుపోయిన శరీరమే సాక్షి.. పైగా దేనికి జవాబివ్వకపోవడం.

"మోహన్‌చంద్! దీనికి నువ్వేమని సంజాయిషీ ఇచ్చుకుంటావ్" మృదువుగా, సౌమ్యంగా అడిగాడు పాదుషా.

తలెత్తి చూశాడు మోహన్‌చంద్. "ఏలినవారు మన్నించాలి. పాదుషా వారికే సమాధానం ఇచ్చుకునే స్థితిలో నేను. నేచేసిన తప్పేమిటో ఒక్క భగవంతునికే తెలుసు."

సభంతా నిశ్శబ్దం

యమునానది నుండి వచ్చిన పవనుడు ఆనందంగా అతన్ని రాచుకుంటూ వెళ్లాడు.

"అయితే నేరం వొప్పుకున్నట్టేగా?"

"..."

"అంతఃపుర ప్రవేశం రాజద్రోహంకంటే ఘోరమైనది" సూచన ప్రాయంగా చెప్పాడు. పాదుషా వెనుకనున్న ధర్మకాంటా, ఒకవైపే మొగ్గిందేమో..

×××

"ప్రభూ! ఏమిటీ మౌనం? నా అంతరాత్మ మీరు దోషులుకారని చెబుతున్నదే, మీరెందుకిలా మారిపోయారు? ప్రాణేశ్వరా.. మీ ధర్మపత్నిని కానా? మీ, నా, మధ్యేమైన దాపరికాలున్నాయా? నావద్ద కూడా మౌనాన్నివీడరేం ప్రభూ..." అంటూ కారాగృహ ద్వారానికున్న ఇనుపచువ్వలకు తలబాదుకుంది పూర్ణిమ.

నిస్సహాయంగా చేతులు అడ్డం ఉంచుతూ వారించాడు మోహన్‌చంద్. "పూర్ణా! మనమెవ్వరం?... పవిత్ర హైందవులం కదూ?.. పాపాన్ని భరించలేం కదూ?.. క్షమ మన మొదటి లక్ష్యం కదూ. పూర్ణిమకివన్నీ అంతుపట్టలేదు. భర్త మొఖంలోని భావాలు చదువ ప్రయత్నించిందికాని కడలి లోతు మానవులకు లొంగుతుందా?

"ఒకరు అజ్ఞానంతో తప్పు చేస్తారనుకో, దాన్ని దుయ్యబట్టడం ధర్మంకాదు. వారిని మంచి త్రోవన నడిపించడానికి మనం మన సర్వం త్యాగం చేసైనా వారి కన్నులు తెరిపించాలి కదూ?..."

భర్త కరకమలాల్లో తన చెక్కిళ్ళను దాచుకుని, పరవశమౌతున్న పూర్ణిమకివేం అర్థం కాలేదు.

"ప్రభూ!... మీమీద ఇలా నేరం ఎందుకు మోపబడిందో చెబుతారా?"

"అది తప్ప మరేదైనా అడుగు పూర్ణిమా!"

"ఐతే నా మాంగల్యాన్ని కాపాడండి."

"అది మొదటి ప్రశ్నకు సంబంధించింది." రెండు చేతుల్లో ముఖాన్ని దాచుకున్నాడు, పెల్లుబుకుతున్న దుఃఖాన్ని భార్యకు కనపడనీయకుండా.

"ఆత్మద్రోహము.. ఆత్మహత్య పాపాలు కదూ..."

"పూర్ణిమా! ఈ ప్రశ్న ఎందుకు వేశావో నాకు తెలుసు. లేదు.. నీవు చావవద్దు. మన ఉదయుడి కోసమేనా నీవు బ్రతకాలి" అంటూ ఆందోళనతో భుజాలు పట్టుకుని కుదిపాడు పూర్ణిమను.

"మీకు నాపై యెంత ప్రేముందో నాకూ అంతే ఉంది. చెప్పరా.. అగ్నిసాక్షిగా పెళ్ళాడిన అర్ధాంగి మధ్య ఏ దాపరికం కూడదంటారే... మీరిలా ప్రవర్తించడం తగునా?... ఆర్య పురుషులకిది తగునా?"

"..."

"ఆ కళ్ళెదుట మీ చావు చూడలేను. భగవాన్ నన్ను ముత్తయిదువుగానే చావనివ్వు" అంటూ నుదురును గోడకేసి బాదుకుంది.

"పూర్ణిమా నిజంగా నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నావు. విను. ఇదీ అసలు జరిగిన సంగతి...!!

×××

ఆ నిశ్శబ్ద నిశీధిలో ఢిల్లీ-ఆగ్రాల మధ్య వెలుతురు సహాయం కూడా లేకుండా ఓ గుఱ్ఱం పరుగెడుతున్నది. అది పూర్ణిమది. భర్త వద్ద నుండి ఆ రహస్యం తెలుసుకున్నాక భర్తను రక్షించుకోవాలనుకుంది.

హైందవ నారీమణులు అబలలు కాదు సబలలు. అగాధ మగు లోతులతో గంభీరంగా ఉన్నా అది ప్రజ్వరి ల్లిందంటే చాలు. ఆ తుఫానుకు మహానౌకలు కూడా

## మొగ్గలు

**పిడికెడు మెతుకుల కోసం కడుపు నింపాల్సిన**
**మగ్గంగుంత చితికిన దేహాలను వాగ్దానం చేస్తున్నది**
**బక్కచిక్కిన దేహాలిప్పుడే నేతన్నల పడుగుపేకలు.**

**నరాలను పోగులుగా మార్చి అందంగా పట్టుచీరనేసి**
**బంగారు జలతారును సింగారముగా మెరిపిస్తరు**
**పొట్టలు మాడినా పట్టుచీరను వెలిగించేది నేతన్నలు.**

**మానవ నాగరికత పరిణామాలకు సజీవసాక్ష్యమై**
**భారతదేశ సంస్కృతి మూలాలకు**
**జీవనాదయ్యింది**
**ప్రపంచానికి బట్టలు కప్పిన**
**మహాదాతలు చేనేతలు**



-దా॥భీంపల్లి శ్రీకాంత్
9032844017

నావి రూపాలు లోకండా నాశనమవ్వాల్సిందే. కన్నున కాసం త కెంపు కది లిన చాలు. ఖగోళో వరితలము అగ్ని కీలలు కావల్సిందే. మాతృస్వరూపిణి, లయ స్వరూపిణి స్త్రీయే.

అన్న పానాదులు ముట్టుకోకుండా ప్రయాణమౌతున్నది. దాదాపు వంద మైళ్ల దూరంలో ఏబది మైళ్ళు దాటేసింది. శోష వచ్చేట్లున్నది. కాని.. ఆ కళ్ళు కుప్పకు పోయిన కామాంధ కిని, కళంకినిని, కపటిని.. రాజప్రాంగణంలో జరిగే అత్యాచా రాలని, దురాలోచనల్ని పరదా తొలగించి చూపాలి. చక్రవర్తికి కనువిప్పు చేయాలి. ఇదే పూర్ణిమ ఆశయం.

గుఱ్ఱం వేగం తగ్గించింది. అలిసిపో యిందేమో, పాపం సరిగా మేత కూడా తినిపించలేదు. నోట నురుగులు క్రక్కుతున్నది. ఇక ఎంతోసేపు నడవలేదు.

ఇరవయి మైళ్ళ దగ్గర పడింది ఆగ్రా. క్రమంగా చీకటి పలుచబడుతున్నది. గుఱ్ఱం నేలకొరిగింది. అది అలా అవుతుందని పూర్ణిమకు తెలుసు. హయాన్ని సమీపించి మ్రొక్కింది. "అశ్వరాజమా! నీ ప్రాణాల నిచ్చి నాకు సహాయపడ్డావయ్యా! నా స్వార్థం.. కాదు పాదుషావారికి కనువిప్పు కొరకు నిన్ను వాడుకున్నాను. జన్మజన్మలకు నీకు ఋణపడి ఉంటాను సెలవు" అంటూ నడక సాగించింది. త్వరితంగా నడవలేకపోయింది. ఎండ కన్నెరుగని సుకుమారి, కాలు క్రిందుంచి పట్టుమని పది గజాలు నడవనిది ఆగ్రా దాక నడవాలి. సూర్యుడు వచ్చేసాడు రక్తారుణిమతో. "ప్రభూ న్యాయానికి ప్రపంచంలో చోటు ఎందుకివ్వవు? నేనింతవరకూ ఏ పాప మూ ఎరుగని పుణ్యశాలినివి. నా భర్తనెలాగైనా రక్షించు, దీనరక్షా!" అని ప్రార్థిస్తూనే నడు స్తున్నది. శోషవచ్చి కూలిపోయింది బాటమీదే. కాని తేరుకుంది. కడుపులో ప్రేవులు మెలిపెడ్తు న్నాయి. వికారం కలుగసాగింది. అయినా నడుస్తూనే వుంది.

ఐదు, నాలుగు, మూడు, రెండు, ఇహ ఒకటే మైలు. తాను పాదుషాను కలుసుకోవాలి. వారి పాదాలపైనైనా పడి భర్తను భ్రతికించమని కోరాలి.

కోట మీది 'హవామహల్' కనిపించింది. ఇంకెంతో దూరం లేదు. పతిప్రతకు, ముల్లోకాల్లోను అపజయం లేదం టారు. అదే ఆశ మనసులో ఏమూలో వుండి పీకుతోంది.

రక్తం క్రక్కుకుంది. కళ్లు తిరిగి మళ్లీ పడినంతపనైంది. కాని నిలద్రొక్కుకుంది. ఆగి, చీర చెరగుతో తుడుచుకుని మళ్ళీ ప్రయాణం కావించింది.

అదో.. అదే.. మాన్‌సింగ్ గేట్ ఇంకో వందగజాలు.. అంతే.. దాటింది..

మోతీమహల్ నుండి అప్పుడే నమాజ్ గావించి మహారాణి సమేతంగా బిగ్గరగా నవ్వుకుంటూ వస్తున్నాడు.

"జహాఁపనా!" ఎక్కడలేని సత్తువ వచ్చింది గొంతులోకి. కాని హీనస్వరంతోనే పిలవగలిగింది. ఖాస్‌మహల్ గడపలో కాలిడుతూనే ఈ మాట విని వెనుదిరిగి చూసాడు. దెక్కుంటూ వచ్చింది పాదుషా పాదాల వద్దకు.

"పాదుషాఁ!..." మళ్ళీ రక్తం క్రక్కుకుంది. అసహ్యపడ్డా రిద్దరూ, కాని తెలుసుకోవాలన్న వుత్సుకత పాదుషావారి నాపింది.

"నే..ను... మోహన్‌చంద్.. భార్య.. వారు.. నిర్దోషి..." మాటలు రావటం లేదు. మహారానిణి గ్రహించింది.లేని నవ్వును తెచ్చుకుంటూ "ఇదో పిచ్చిది పాదుషా! పదండి మనకు ఫలహారవేళ అయింది. ఇవ్వేళ నేను స్వయంగా చేయించాను. మీకిష్టమయినవన్నీ" అంటూ భుజనం పట్టుకుని లోనికి తీసుకెళ్ళింది.

పదిదాకా పాలరాతి మెట్లు, అన్నీ ఎక్కలేదు, సరికదా ప్రాకలేదు కూడా.. బట్టలన్ని మట్టికొట్టుకుపోయాయి. మెల్లిగా ఎక్కడానికి ప్రయత్నించింది.. 'టంగ్.. టంగ్.." మని ఝాముకొట్టారు.

×××

"భగవాన్! నా భర్త ఉరికంబం వద్ద నిలబడ్డాడు. నాకంతా కనిపిస్తున్నది. అదిగో.. ముసుగు తొడుగుతున్నారు.. అదిగో.. భగవాన్! నీవు నీ లీలలు అన్నీ వట్టివే, దగాకోరువు. పుణాత్ముడైన నా భర్తను రక్షించలేకపోయావు."

"ఆర్యపుత్రా! నేనూ మీతోపాటే వస్తున్నా..." కొంచెం లేచి మరో మెట్టు ఎక్కబోయింది. కాని పడిపోయింది.

శిరస్సు పాలరాతి మెట్టు కోణానికి తగిలి రక్తం స్రవంతిగా కారింది. తెల్లటి పాలరాయి కలుషితమై పోయింది ఆ ప్రవాహం అలా ఎంతో దూరం పోయింది.సరిగ్గా ఒకేసారి భార్య భర్తలిద్దరూ ప్రాణాలను విడిచిపోట్టారు. బహుశా భగవంతుడు అంత వరకేమన్నించాడేమో...

## సమయం సజీవ సాక్ష్యం

సమయం నిశ్శబ్దంగా..
నిలకడగా ప్రవహిస్తుంది
గడియారమే టిక్ టిక్ అంటూ..
తెగ పొగరుగా అరుస్తుంది !.
సమయానికి పక్షపాతం లేదు
సమయం చేతిలో చేయివేసి..
లక్ష్యం వైపు ఏకాగ్రతతో నడిస్తే..
విజయతీరాలకు చేర్చుతుంది !.
సమయంలో మన ప్రాణ మిత్రుడు
మనకు ఏం, ఎప్పుడు, ఎక్కడ?
ఎం ఇవ్వాలో తెలివిగా తెలుసుకొని..
మన జీవిత పల్లెంలో వడ్డిస్తుంది !.
సమయానికి విలువనిస్తే..
మహోన్నత శిఖరాలకు చేర్చుతుంది
సమయాన్ని చులకన చేస్తే..
అధ పాతాళానికి తోసేస్తుంది !.
జీవితాన్ని ఆస్వాదిస్తే వేగంగా..
కష్టనష్టాల బాధల్లో నెమ్మదిగా..
ఎదురు చూపుల్లో మందకోడిగా..
శుభ కార్యాల్లో జోరుగా వడివడిగా..
కదిలినట్లు అనిపించే సమయం
నరులతో ఆడుతుంది వింత నాటకం
మన రాకపోకలకు
అదో సజీవ సాక్ష్యం
దాన్ని తప్పించుకోవడం
అసాధ్యం !



-మధుపాళీ
9949700037

## నానీలు

**లేనివాడు చేస్తున్నది**
**బెగ్గింగ్**
**మరి ఉన్నవాడు!?**
**డైటింగ్.**

**తిండి పెట్టకున్నా**
**కొడుకు తినలేదని బాధ**
**అమ్మ గుండె**
**లోతైన గాధ!**

**రాయిని**
**రత్నంగా చెక్కాడు**
**అధ్యాపకుని కన్నా**
**అమర శిల్పి ఎవరు?**

**క్లాస్ ఎప్పుడూ**
**వెనక వరసే**
**ఇప్పుడాయన**
**అగ్ర నాయకుడు**

**బట్టలేసుకోవడం**
**బరువంట!**
**భలే వాడివే**
**ఆమె నవీన వనిత.**



-మాడిశెట్టి గోపాల్
సెల్:9440238852

## అమరజీవీ నీకు నిరంతర జోహార్లు

ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస కుటుంబం.
షోయబుల్లాఖాన్ ను ఈ ప్రాంతానికి ప్రసాదించిన వరం.
ధన్యులు అతని తండ్రి హబీబుల్లాఖాన్, తల్లి లాయఖున్నీసా బేగం.
నిష్కామ ప్రజా సేవలో మురిసింది షోయబుల్లాఖాన్ జర్నలిజం.

నిజాం తన రాజ్య ప్రజలను హింసిస్తూ ...
కోట్లాది రూపాయలను పాకిస్తాన్ కు ధారాదత్తం చేస్తూ ...
తనకి వ్యతిరేకంగా నడిపించే పత్రికలను మూసేస్తూ...
ధారుణాతి దారుణాలకు కారణమయ్యే నిరంకుశ పాలనలో.

తన కలంతో వాడిగా, వేడిని నింపి ప్రజా చైతన్యాన్ని రగిల్చి,
ఒక పత్రికను మూసేస్తే మరో పత్రిక ద్వారా పోరాడి,
చివరకు సొంత పత్రికను స్థైర్యాన్ని వదలక నడిపి,
ప్రాణాలను సహితం లెక్క చేయని పాత్రికేయుడు షోయబుల్లాఖాన్.

ఏడుగురు ముస్లిం పెద్దలు తయారుచేసే ఓ పత్రాన్ని.
నిజాం రాజ్యాన్ని భారత యూనియన్‌లో కలుపమని హితవు పలికె.
ఈ నిజాన్ని ఇమ్రోజ్ పత్రికలో యధాతథంగా షోయబుల్లా ఖాన్ చూపె.
భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలో దాన్ని చూపి లాభపడె.

తన కలాన్ని షోయబుల్లా ఖాన్ ఆయుధంగా వాడె.
దేశంకోసం ధైర్య సాహసాలను చూపె.
కుట్రదారులకు తెలుసా నీతి నిజాయితీల విలువ!
ఆ దేశ భక్తుడిని హత్య చేశారే ...
అమరజీవీ అందుకో మా నిరంతర జోహార్లు

**-విత్తనాల విజయకుమార్**
9985117789



## కవితార్చన

అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

## ఆ క్షణం

నీ చిరునవ్వు చూసిన క్షణం
నా గుండె కొట్టుకోవడం మరిచిన క్షణం
ఆ చిరునవ్వులోనే నా కల
దాగి ఉన్నదని తెలిసిన క్షణం
ఆ కలలోనే నీతో
నా జీవితం ఉంది అని తెలిసిన క్షణం
మరువలేను చెలి..
ప్రతి ఉదయం నీ తలపుతోనే మొదలు
నువ్వు లేకుంటే ఆ ఉదయం చీకటనే నా దిగులు
కానరాక ఎందుకు గుండె గుబులు.
నీ కలలలో నేనున్నాననే ఆశ
నా కలలలో నువ్వే ఉన్నావనే శ్వాస
ఆశతోనే ఎదురుచూస్తున్నా
నువ్వు ఒక్క మాట చెబుతావని విశ్వాస
నీ ఆశ నేనైతే చాలు అని
అత్యశ నన్ను నిలవనీయులకున్నది సఖి
చిరునవ్వుతో దోచావు
కలలోకి లాగావు
ఉదయం అంతా నీ ధ్యాసలోనే
రాతిరంతా నీ ఆశతోనే వేచి ఉన్న ప్రియ సఖి..

**-సంధ్య జంగాల**
92469 22626

## 'ఏ మతమైనా మానవత్వంతో పరిమళించాలి

మతం అంటే ఏమిటి?ఆత్మను తట్టి లేపే దివ్య మంత్రం
మానవత్వం అంటే ఏమిటి?ఆ మంత్రంలోని పరమార్థం..
మతమనేది..మనిషి మనసుకు వేసే వెలుగు బాట
మానవత్వమనేది ఆ బాటలో విరిసే కరుణ తోట..
దేవాలయ గంటలో భక్తి స్వరం వినిపిస్తుంది
ఆర్తజనుల గుండెలో దైవ స్వరం ప్రతిధ్వనిస్తుంది..
చర్చిలో ప్రార్థన చేస్తే..శాంతి దొరుకుతుంది
ఆకలితో ఉన్నవాడికి అన్నం పెడితే..మనకు మనశ్శాంతి లభిస్తుంది..
మసీదులో అజాన్ వింటే.. అల్లా గుర్తొస్తాడు
కష్టంలో ఉన్నవాడిని ఆదుకుంటే..అల్లా ఎదురొస్తాడు..
మతం మనకు నేర్పింది దేవుడిని పూజించమని
మానవత్వం మనకు నేర్పింది మనిషిని ప్రేమించమని,..
మత గ్రంథాలు చదివితే.. జ్ఞానం వస్తుంది
మనిషి కన్నీరు తుడిస్తే.. మోక్షం వస్తుంది..
కులం చూసి మనిషిని దూరం పెడితే
అది మతం కాదు
గుణం చూసి మనిషిని దగ్గరకు తీస్తే అదే మానవత్వం..
రక్తం అందరిదీ ఎర్రగానే ఉంటుంది
కన్నీరు అందరిదీ ఉప్పగానే ఉంటుంది
మరి మతం పేరుతో
మనుషులను విడదీయడం ఎందుకు..
దేవుడు ఒక్కడే పేర్లు మాత్రమే వేరు
మనిషి ఒక్కడే మతాలు మాత్రమే వేరు..
మతాన్ని మదిలో ఉంచుకుందాం
మానవత్వాన్ని ప్రపంచానికి పంచుదాం..
మతం మన వ్యక్తిగత సమ్మకం కావాలి
మానవత్వం మనందరి బతుకు కావాలి..!

**-ముత్యం వెంకటేశ్వరరావు**
79978 40591

## కులం కన్నా గుణం గొప్పది (మానవత్వం)

కులమతాల కుమ్ములాటలే
ద్వేయం కొందరికి
పొట్టకూటి అగజాట్లే ఇంకొందరికి
మానవత్వాన్ని పరిమళింపజేయాలి
మనం ఎప్పటికి.....!
సృష్టికి జీవం పోసిన దేవుడు
ఒక్కడే కానీ మనుషులు గీసుకున్న
గీతలు ఎన్నెన్నో
కులమంత ఒక కంచె
మతమంత ఒక గోడ
ఈ నడిమధ్యన నలిగిపోతోంది
మానవత్వం.
కులం కూడు పెట్టదు మతం
మంచినీళ్లుఇవ్వదు సంస్కారమే
సాయం చేస్తుంద మమకారమే
సహాయం చేస్తుంది
గాలికి లేదు కులం నేర్పు లేదు
కులం చెట్టుకు లేదు కులం నేలకు లేదు
కులం మనుషులం మనకెందుకు ఈ కులం.
ఈ భూలోకంలో ఎవరికి లేని కులం
దేవుడి సృష్టించిన ఈ సంపదనకు లేని కులం
మానవజాతికి ఎందుకు కులం
మతం గోడలను బద్దలు కొడదాం
సమాజాన్ని
మానవత్వం అనే రాయితో నిలబెడదాం.

**-దారా శ్రీకాంత్**
9676059716

## అంకురం

విజయం సాధించాలనే గట్టి సంకల్పం
చీకటినైనా చీల్చుకొని ఎదురీది పయనిస్తుంది వెలుగు వైపు...
యాతనను అనుభవిస్తున్నా
ప్రాణాలకు తెగించి
ఓ జీవికి జన్మ నివ్వాలన్న తపన ఉన్న తల్లిలా...
హృదయం పిండేస్తున్నా
మెదడును తొలిచేస్తున్నా
మేధోమథనాన్ని చేసి కవి
హృదయం నుండి జాలువారే కవిత్వం లా...
కష్టాలను లెక్కచేయదు సంకల్ప బలం
ఆటంకాలను అధిగమించి
విజయం సాధించడమే దాని లక్ష్యం...
భూగర్భ చీకటిని చీల్చుకొని..
వెలుగు వైపు తొంగిచూసింది
నిటారుగా తలెత్తింది చిన్ని అంకురం...
ప్రాణవాయువును అందించడమే దాని పరమార్థం...

**-నంద్యాల సరస్వతి**, 94904 82795

# ధరణి తెలంగాణలో భూచరిత్రకు సుదీర్ఘమైన పోరాట చరిత్ర




ప్రతులకు: వి. బాలరాజు
ఇ.నెం. 1-5-10,
ప్రశాంత్‌నగర్, ఓల్డ్ అల్వాల్,
సికింద్రాబాద్-500 010

**వి.బాలరాజు రచించిన "ధరణి" రైతుల గోస పుస్తకానికి సారంపల్లి మల్లారెడ్డి పుస్తకానికి రాసిన ముందుమాట**

తెలంగాణలో భూచరిత్రకు సుదీర్ఘమైన పోరాట చరిత్ర ఇది. ఈ చరిత్ర ప్రపంచ ఖ్యాతిగాంచినది.

భారతదేశానికి 1947 ఆగష్టు 15 స్వాతంత్ర్యం వచ్చి, 1948లో కేంద్ర ప్రభుత్వం ఎస్టేట్‌ల రద్దు చట్టం అమలులోకి వచ్చినప్పటికీ, తెలంగాణలో 1948 సెప్టెంబర్ 17న నైజాం భారతదేశం లో విలీనం అయిన తరువాతనే భూ సమస్యలు పరిష్కరించబడ్డాయి. సుప్రీం కోర్టు లో కూడా సవాలు చేయలే రక్షిత కౌలుదారి చట్టం-1950ను నాటి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం తెచ్చింది. నైజాం కాలంలో మొదటిసారి 1970లో భూ చట్టాలు చేశారు. ఆ తరువాత నుండీ నేటికీ భూ చట్టాలలో ప్రభుత్వాలు అనేక సవరణలు చేస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ధరణిని భూ భారతిగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ చట్ట సవరణ చేసింది. అయిన రైతుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు.

మొదటిసారి 1849లో రెవెన్యూ బోర్డు ఏర్పడింది. నాడు ప్రభుత్వానికి వ్యవసా యంపై ఆధాయం వచ్చే రంగాలను ఈ బోర్డు క్రింద చేర్చారు. 1. ల్యాండ్ రెవెన్యూ అండ్ సెటిల్ మెంట్. 2. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ 3. కమర్షియల్ టాక్స్ 4. సివిల్ సప్లయిస్. 5. ఎండోమెంట్స్ 6. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 7. కస్టమ్స్ 8. కోర్టు ఆఫ్‌వార్డ్స్- పై సంస్థలకు సహకరించడానికి పోలీస్ శాఖను ఏర్పరచారు. ఈ సంస్థలే పెరిగి నేడు రాష్ట్రంలో 42 శాఖలుగా విస్తరించాయి.

ప్రభుత్వ శాఖలన్ని భూ సంబంధాలు లేకుండా పని చేయలేవు. జమీందారులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌ల గల రాష్ట్రంలో కౌలు ప్రధాన సమస్యగా ఉంది. కౌలు దోపిడీ అరికట్టడానికి అనేక చట్టాలు చేశారు.

1950, 1956, 1971 మరియు 2011 చట్టాలు చేయబడ్డాయి. అయిన కౌలుదారులకు రక్షణ లేదు. భూ సేకరణకు 1894లో మరియు 2013లో చట్టాలు చేసిన వాటిని అమలు చేయకుండా రాష్ట్రాలు 2017లో చట్టం చేసి అమలు చేస్తున్నాయి.

మార్కెట్ ధర కాకుండా పాలక వర్గాలకు నచ్చిన ధరను కలెక్టర్ ద్వారా నిర్ణ యించి వేలాది ఎకరాల పేదల భూములను సేకరిస్తున్నారు. చివరికి రాజ్యహింసకూడా సాగించి రైతులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటికీ ఆంధ్ర చట్టాలు, తెలంగాణ చట్టాలు విడివిడి గానే ఉన్నాయి. నేటికీ చాలా చట్టాలు ప్రాంతాల వారీగా ఉన్నాయి. 1999 మార్చి 22న 260 సెక్షన్‌లతో 2 రాష్ట్రాల చట్టాలను ఏకీకృతం చేసి ముసాయిదాను చంద్రబాబు ప్రకటించగా, దానిని భూస్వాములు ప్రతిఘ టించి అమలు కాకుండా చూశారు.

అంతేకాక తెలంగాణలో ఆంధ్ర నమోన భూ సర్వే చేయడానికి ఆ సంవత్సరమే చట్టం చేశారు. ఆ చట్టాన్ని తెలంగాణ సర్వేయర్లు సుప్రీంకోర్టు అమలు కాకుండా చేశారు. తెలంగాణలో 1940లో సర్వే జరిగిన తరువాత నేటికీ జరగలేదు.

నిజామా బాద్‌లో నమోన సర్వే చేసినప్పటి అది ఫలితాలు సాధించలేదు.

ఆంధ్ర సర్వే ప్రకారం మాగాని 5 ఎకరాలు ఒక సర్వే నెంబర్, మెట్ట 10 ఎకరాలు ఒక సర్వేనెంబర్‌గా శాసన సభలో చట్టం చేసినప్పటికీ దానిని కూడా అడ్డుకున్నారు. జమీందారులు పోయి భూస్వాములుగా రూపొంది పాత విధానాలనే పాలక వర్గంగా కొనసాగిస్తున్నారు.

వారు పేదల భూములు సేకరిం చడానికి అడ్డుగల చట్టా లను సవరించు కుంటున్నారు. ఫామ్‌హౌజ్‌లు, స్విమ్మింగ్ పూల్స్, తోటలు తదితర పనులకు వందల ఎకరాల భూములు సేకరిస్తు న్నారు. చట్టాలు ఏమి చేసి వాటి నుండి తప్పించుకోవ డానికి ఆ చట్టంలోనే కొన్ని లోపాలను లూప్ హోల్స్ పెడుతారు.

భూసీలింగ్ చట్టాన్ని నిర్ణయించిన 10 స్టాండర్డ్ ఎకరాల నుండి 54 ఎకరాలను అదిగమించి భూసీలింగ్ చట్టంలో 1. ట్రస్టీల ఏర్పాటు 2. కాఫీ, రబ్బర్ తోటలు వేసిన వారికి 3. ప్రభుత్వం మం జూరు చేసిన భూములకు సీలింగ్ వర్తించ కుండా చేశారు. ప్రతి రెవెన్యూ చట్టంలో ఇలాంటి లోపాలు ఉన్నాయి.

ఇప్ప టికే ఉన్న చట్టాలను అమలు చేయకుండా మరల కొత్త చట్టాలు తెస్తున్నారు. ధరణి, భూభారతి చట్టంలోని అంశాలు గత రెవెన్యూ చట్టాలలో ఉన్నాయి.

కానీ భూస్వాములకు లాభం కలిగే విధంగా ఈ చట్టాలలో సవరణలు చేశారు. ధరణి చట్టం వలన 13 లక్షల మంది రైతులు తమ హక్కులు కోల్పోయి పాస్ పుస్తకాలకు దూరమయ్యారు. వాట ని సరిచేయడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం క్యాబినెట్ కమిటి వేసింది. ఆ కమిటీ 4.5 లక్షల మంది ఒక్కొక్కరి నుండీ రూ. 1650లు మీ సేవలో కట్టించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం తహశీల్దార్, ఆర్డిఓ కలెక్టర్, సిసిఎల్ఏ రెవెన్యూ కోర్టు లను రద్దు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ ఆ వ్యవ స్థలను పునఃప్రతిష్టించారు.

కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చాక ప్రజాపాలనలో 70 లక్షల మంది రైతులు భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు పెట్టుకున్నారు. నాటి నుండి నేటికీ లక్షల మంది రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

రెవెన్యూ పోలీస్ శాఖలలో అవినీతి ఉం దని పాలకులు నిరంతర ప్రచారం చేస్తున్నారు. పాలక వర్గ నాయకులే అవినీతిని ప్రోత్సహించి తమ ప్రయో జనాలను రక్షించుకుంటున్నారు. ఆ శాఖ లను తమ అవసరాల కొరకు అవినీతి పరంగా మార్చి నిందలు వేస్తున్నారు. చట్టాలను అమలు కాకుండా పాలకులే అడ్డుపడుతున్నారు.

దేవాలయ భూములు, వక్స్ భూము లు, ప్రభుత్వ భూములు, అటవీ బంజర్లు, పేదలు సాగుచే స్తున్నా వాటిని భూస్వాములు కాజేస్తున్నారు. 1955 ఇనామ్‌ల రద్దు చట్టం, 1950 రక్షిత కౌలుదారుల చట్టం నేటికీ పూర్తిగా అమలు జరగలేదు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల రక్షణకు తెచ్చిన 111 జీఓను కూడా అమలు జరగలేదు.

చట్టాలకు రూల్స్ రూపొ ందించడం, రూల్స్ జీవోలు విడుదల చేయ డం జరిగినప్పటికీ అనేక జీవోలు అమలుకా కుండా ఉన్నాయి. అందువలన చట్టాలను, రూల్స్‌ను చిత్తశు ద్ధితో అమలు జరపాలి. భూభారతి అందుకుమినహాయింపు కావాలి. రైతుల సమస్యలు పరిష్కరించాలి.

సామాజిక స్పృహ కలిగిన వి.బాల రాజు రిటైర్డ్ తహశీల్దార్ తెలంగాణ భూ సమస్యలపై 30కి పైగా వ్యాసాలను రాసి ప్రజలను చైతన్యం కల్గించే పని చేశారు. పౌరహక్కుల సంఘం, మానవ హక్కుల వేదికతో కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు.

వాస్తవ దృష్టితో వీరు వెలుబుచ్చిన అభిప్రాయాలతో రైతులకు న్యాయం కోరేవారు ఏకీభవించాలి.

ఎన్ని చట్టాలు మారిన మారని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. అందుకు ఈ చిన్న పుస్తకం తోడ్పడు తుందని ఆశిస్తున్నాను.

**- సారంపల్లి మల్లారెడ్డి**
సెల్: 9490098666

# మనం మరిచిన మనచరిత్ర




ప్రతులకు:కపిలవాయి అశోక్‌బాబు
ఫ్లాట్ నెం.404-సి బ్లాక్, వైదేహి నివాస్,
గోల్డెన్ పామ్, అచ్యుతరెడ్డి మార్గ్
విద్యానగర్, హైదరాబాద్500 044
సెల్: 8790727772

**కపిలవాయి అశోక్‌బాబు రచించిన ఉమ్మడి పాలమూరు జిల్లా కవి పండిత వంశాలు -యోగులు పుస్తకానికి సంబరాజు రవిప్రకాశరావు రాసిన ముందుమాట.**

కొత్తదనం లింగమూర్తిగారి లేఖినికి తెలిసిన విద్య' అన్న మాట వారి రచనలను చదివినప్పుడల్లా గుర్తుకు వస్తుంది. మనం తరచుగా వాడే కీర్తి విశేషణాలకు అందని కవిత్వ పనితనం వారి సొంతం. అరిషడ్వర్గాలను లింగమూర్తిగారు జయించినారని చెప్పడానికి వారి రచనలు సజీవ సాక్ష్యాలు.

ప్రతిభావంతులైన కవుల గురించో, రచయితల గురించో లేక వారి రచనల గురించో రాయడానికి నేటితరం లబ్ధ ప్రతిష్టులు నాలుగు అడుగులు వెనక్కి వేస్తున్నారు. తాము రాయడం వలన వారెక్కడ లబ్ధి పొందుతారో లేదా ప్రసిద్ధులుగా ప్రపంచం దృష్టిలో పడతారో అని వారి భయం. ఇటు వంటి ఈర్ష్యాకులవలు లింగమూర్తి గారిని చూసి చాలా నేర్చుకోవాలి.

ఎక్కడ కొంచెం ప్రతిభ ఉన్నా ఎక్కడ కాసింత పాండిత్యం కనబడినా దానిని గ్రంతస్థం చేసి ఆ కవి పండితులకు శాశ్వతత్వం కల్పించిన లింగమూర్తి గారి కృషి, ఆలోచనా విధానం నేటితరానికి ఆదర్శనీ యమైనది. కీలకమైన పదవులలో ఉన్న వారికి అంకితాలివ్వడం, ప్రయోజనాన్ని ఆశించి విషయం లేకున్నా రచనలు చేయడం, పురస్కారాలను ఆశించి అక్షరాలను వెదజల్లడం నిత్యకృత్యాలుగా, సహజ లక్షణాలుగా ఉన్న ప్రస్తుత సమాజానికి లింగమూర్తి వంటి వారు నిస్కామ, నిర్మామ కర్మగా చేసిన సాహిత్య కృషి తలకెక్కక పోవచ్చు. ఎక్కేలా చేయడం తలకు మించిన పని అనిపిస్తుంది.

స్థానికచరిత్రలను, అజ్ఞాతకవుల విషయా లను, విశేషాలను సాహిత్య ప్రపంచానికి తెలియచేయడం లింగమూర్తి గారికి వెన్నతో పెట్టిన విద్య, ఈనాడు ఒక తెలకపల్లె రామచంద్ర శాస్త్రి గురించో లేక ఎల్లూరి నరసింగకవి గురించో, నాయాణా ధ్వరి గురిం చో ప్రచారంలో ఉండటానికి కారణం కపిల వాయి లింగమూర్తిగారేనని ఘంటాపథంగా చెప్పక తప్పదు. తెలంగాణ వికాస సమితి' వారు ప్రచురించిన 'మొదటి చెంచుమహాసభ' పుస్తకం వెలుగు చూడటానికి ప్రధాన కారణం లింగమూర్తిగారే.

ఈ పుస్తకంలోని కొన్ని వ్యాసాలు వంశం పేరుతో ఉన్నాయి. మరికొన్ని గోత్రం పేరుతో ఉన్నాయి. కొన్ని యోగుల చరిత్రలున్నాయి. వంశమైనా, గోత్రమైనా విస్తృతమైన పరిధిని కలిగి ఉంటుంది. ఈ వ్యాసాలలో కపిలవాయి వారి పరిశోధనా ప్రతిమతో పాటు లోతైన విశ్లేషణ, సాధికారిక సమాచార సేకరణ నైపుణ్యం మనలను ఆశ్చర్య పరుస్తుంది. సమాచార సేకరణ కోసం అనేక సులభ మార్గాలు ఉన్న నేటి కాలంలో ఇంతటి లోతైన ప్రామాణిక సమాచారాన్ని సేకరించలేమోననే అనుమానం నాకైతే ఉంది. ఈ పుస్తకంలోని వ్యాసాలలో, కేవలం కవిపేరు, తల్లిదండ్రులపేర్లు రచనల పట్టికకు మాత్రమే పరిమి తం కాలేదు. అవసరమైన చోట పూర్వీకుల విశేషాల తో పాటు, రచనాసౌందర్యాన్ని లింగ రిగారు సోదాహరణంగా తెలిపారు. ఇందులో సురభి పట్టణ ము ను గురించి వారు చేసిన చర్చ నేటి చరిత్ర పరిశోధకులకు, పురావస్తు పరిశోధకు లకు ఒక కరదీపికలాగ ఉపయోగప డుతుంది. ఎవరైనా సాహసించి శ్రద్ధతో పరిశోధన చేస్తే మరిన్ని విషయాలు లోకానికి తెలిపే అవకాశాలు ఉన్నవి.

మనమంతా మరచిపోయిన వెల్లాల సదా శివశాస్త్రి, అక్షింతలసుబ్బాశాస్త్రి, విశ్వనాథ వారికే పాఠాలు చెప్పిన తెలకపల్లె రామచంద్ర శాస్త్రి, పూదత్తు కృష్ణదాసు, కసుబా కృష్ణమాచార్యుల వంటి వారెందరినో ఈ పుస్తకం గుర్తు చేస్తుంది.

మన పూర్వీకుల ఘనతను తెలియపరుస్తుంది. మనలకు ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుంది. మనం నడవాల్సిన దారిని, చే యాల్సిన ప్రయత్నాన్ని, ఆలోచించాల్సిన తీరును, వెలికితీయాల్సిన చరిత్ర ను ఈ పుస్తకం సూచిస్తుంది.

ఈ వ్యాసాలలో **'నంబ రాజువారు'** అనే వ్యాసం కూడ ఒకటి ఉంది. మేము 'సంబ రాజు' వంశీయులమే. కాకపోతే మా గోత్రం 'ఆత్రేయస'. వట్టెం సమీప గ్రామాలైన వెల్గొండ, లట్టుపల్లి గ్రామాల సంబరాజు వంశీయులది మాత్రం **'హరితస'** గోత్రం. ఒకే వంశానికి భిన్న గోత్రాలుండడం అరుదు. దానికి కారణాలు ఏమిటో తెలుసుకోవడం ఒక పెద్ద వరిశోధన. దానికి పూనుకునే వారు లేరనే చెప్పవచ్చు. ఈ వ్యాసం చదివిన తర్వాత సంబరాజు శేషాహి, తిరుమల రాయడు, నరసిం గరాయడు, రామంద్రుడు వంటి పూర్వీకుల రచనలపై వచ్చిన వ్యాసాలు, అనమగ్రమైన కావ్యాలు సేకరిం చే పనిలో ఉన్నాను. **'భారతి'**లో ప్రచురితమైన వ్యాసాలు సేకరిం చాను. అచ్చతెలుగు కావ్యాల పరిశోధనాకారులు ఉదహరిం చిన మా పూర్వీకుల పద్యాలు ఒక దగ్గర చేర్చాను. వీలైతే వాటికి గ్రంథ రూపం ఇవ్వాలని ప్రయత్నం చేస్తున్నాను. నాకీ ఆలోచనను ఇచ్చింది ఈ పుస్తకం అని నిస్సందేహంగా చెప్పగలను. నాలాగా ఇందులోని ఇతర వంశాలలోని ప్రస్తుత తరాల వారు ప్రయత్నం చేస్తే ఉపయోగకరమైన నాలుగు విషయాలు సాహిత్య చరిత్రకు చేరుతాయి. అలాంటి ప్రయత్నం మనం చేయాల్సి ఉంది. అప్పుడే ఈ రచనకు సార్థకత చేకూరుతుంది.

కపిలవాయి లింగ రిగారు స్వర్గస్థులై నప్పటికీ వారి ఆముద్రిత గ్రంథాలను ప్రచురణ చేస్తున్న వారి కుమారులు కపిలవాయి అశోక్‌బాబు గారి సాహిత్య సేవ వెలకట్టలేనిది. లింగమూర్తిగారి ముద్రిత, అముద్రిత రచనలను అన్నిటిని డి.టి.పి. చేయించి పి.డి.ఎఫ్ రూపంలో అందుబాటు లోకి తెచ్చిన అశోక్‌బాబు గారి కృషి చిరస్థాయిగా నిల్చిపోతుంది. అశోక్‌బాబు గారికి మాన్య మిత్రుడు కపిలవాయి ఆనంద వర్ధనకు అభినందనలు.

ఈ నాలుగు మాటలు రాసే అవకా శం కల్పించినం దుకు కృతజ్ఞతలు.

**- సంబరాజు రవిప్రకాశరావు**
సెల్: 9491376255



## తరాల తలరాతలు

పక్కనున్న మబ్బు తునకలు
చంద్రకాంతికితూనీగల రెక్కల్లా మెరుస్తున్నాయి !
కానీ
మెరుపు తీగెల యవ్వన పదనాలు
'జంతర మంతరం' జపిస్తున్నాయి దేశమంతా !
తూనీగ విహారం లేదు
తేనెటీగల విహారం లేదు
పూల వనాలు లేవు, తాళ్ల వనాలు లేవు!
నిషేద నైవేద్య యుద్ధాన్నే
పదే పదే గుండెల మోద బాదుకోవాల్సి వస్తుంది !
ప్రాణాధారమైన రక్తాన్ని
పారించాల్సి వస్తుంది ప్రతీ క్షణం !
ఆకలిని అలుసుగా చేసుకుని
ఆగమాగం చేస్తున్నారు అందర్నీ !
ఆకాశ హర్మ్యాల బుల్డోజర్ లను
అవని అణువణువూ ప్రదర్శిస్తున్నారు!
కరువూ అరువులని
ఎరువు వేసి పెంచి పోషిస్తున్నారు !
చేపల్లా, ఊసుళ్ళ లా
పోగుల పోగుల జనాన్ని కన్న కలలు
నరాలు తెగిపోయే నగరాలని పేనుతూ
అన్నం పళ్ళాల పల్లెలని
ఎముకుల గూళ్ళ గా మారుస్తూ ,
తెగుళ్ళ రుతువులని నిద్ర లేపుతున్నారు !
ముసురు మబ్బుల మధ్య సూర్యుడు
తెల్లగా పాలిపోయిదుప్పటి కప్పుకున్న
ముసలి గా మారిపోయాడు !
తలల పాపిడితులల మీద తుయ్యాలి !
దిష్టి బొమ్మలూ కిరీట ధారులూ లాంటి
భేద వాక్యాలు పుటల్లోంచి
చెరిగిపోవాలి !

**-ఒబ్బిని**
9849558842



# సంగీత సాహిత్యాలు మన సంస్కృతికి ప్రతిరూపాలు



సత్కార గ్రహితలతో అతిథులు

హైదరాబాద్, అక్టోబర్ 28:(నేటినిజం ప్రతినిధి): సంగీత సాహిత్యాలు మన దేశ సంస్కృతి ముఖ్యంగా తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలు వంటివని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డా॥కె.వి.రమణ అన్నారు. గత శనివారంహైదరాబాద్ సుల్తాన్‌బజార్, శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషానిలయం ఆడిటోరియంలో జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, సాహితీకిరణం మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత సాహిత్య సమలంకృతే సప్తపదిలో తోడునీడ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సాహిత్య దంపతులైన దూరదర్శన్ పూర్వ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డా॥రేవూరి అనంత పద్మనాభరావు, వారి శ్రీమతి శోభాదేవి(ప్రముఖ కవయిత్రి) దంపతులకు, సంగీత దంపతులైన పాలగుమ్మి వరప్రసాద్ (మృదంగం) వారి శ్రీమతి కళ్యాణి హేమలత (వీణ)లను ఘనంగా సత్కరించారు. డా॥రేవూరి అనంత పద్మనాభరావు అటు దూరదర్శన్‌కి, ఇటు ఎస్.వి.బి.సి.ఛానల్‌కు చేసిన సేవలను డా॥కె.వి.రమణ ప్రశంసించారు. అలాగే యువ సంగీత విద్వాంసులైన పాలగుమ్మి వరప్రసాద్, కళ్యాణి హేమలతల సంగీతాన్ని అనేక సందర్భాల్లో తాను ఆస్వాదించానని, వారికి ఉజ్జ్వల భవిష్యత్తు ఉందని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన డా॥వోలేటి పార్వతీశం తన ప్రసంగంలో ఒకప్పుడు ఆకాశవాణిలో పనిచేసిన అనంత పద్మనాభరావు తనకు గురుతుల్యులని, వారినుంచి ఎన్నో నేర్చుకున్నానని పేర్కొన్నారు. పాలగుమ్మి వరప్రసాద్ దంపతులు భవిష్యత్తులో ఈ సంగీత సామ్రాజ్యాన్ని ఏలాలని మనసారా కోరుకుంటున్నానని తెలియజేశారు. సభను ప్రారంభించిన పొత్తూరి సుబ్బారావు, జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్‌తో తనకెంతో అనుబంధం ఉన్నదని, అందుచేత ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించామని, సత్కారం అందుకున్న దంపతులకు శుభాకాంక్షలం దజేశారు. సత్కారం అందుకున్న డా॥రేవూరి అనంత పద్మనాభరావు తన స్పందనలో తాను ఇంతకుముందు ప్రభుత్వం, ప్రభు త్వేతర సంస్థలనుండి అనేక ఉన్నతమైన పురస్కారాలను అందుకున్నాననీ, కానీ ఈ పురస్కారం వైవిధ్యభరితంగా ఉండి, నన్నెంతో ఆనందపరిచిందని పేర్కొంటూ సన్మానకర్తలను అభినందించారు. శోభాదేవి తాను చేసే ఆధ్యాత్మిక రచనలన్నింటికీ ఈ సన్మానం మరింత ప్రేరణ కలిగిస్తుందని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. సంగీత కళాకారులైన పాలగుమ్మి వరప్రసాద్ దంప తులు తాము ముందు ముందు అనేక ఉత్తమమైన టువంటి కార్యక్రమాల్లో మంచి సంగీతానికి తమ వాద్యసహకారాన్ని అందిస్తామని, ఈ సన్మానం తమకెంతో తృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్దూరి వెంకటదాను నిర్వహించగా, పొత్తూరి జయలక్ష్మి సన్మానపత్రాలను పఠించారు.

కార్యక్రమానికి ముందు జరిగిన అర్చన నృత్య నికేతన్‌వారి కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు వరుణవి రెడ్డి, ఆద్యగుత్తి, మనస్వి, శ్రావ్య, మేహశ్రీ యం.,హంసిని కుంట లు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.

రంగస్థల నటుడు మల్లాది వెంకటరమణ ఈ కార్యక్రమానికి సహకరించారు.

## కళల వల్లనే ప్రత్యేక గుర్తింపు-మౌనశ్రీ మల్లిక్



సభలో పాల్గొన్న అతిథులు

హైదరాబాద్, అక్టోబర్ 28:(నేటినిజం ప్రతినిధి): భారత వికాస పరిషత్ తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో జాతీయ బృందగాన పోటీలను నిర్వహించారు. పిఎన్ఎమ్ ఉన్నత పాఠశాల, కూకట్‌పల్లిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ గేయ కవి మౌనశ్రీ మల్లిక్, సంగీత దర్శకురాలు అమృత మహాభాష్యం, భారత వికాస పరిషత్ బాధ్యులు సిహెచ్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ రామ చంద్రరావు పాల్గొన్నారు. మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ.. చిన్నపిల్లల్లో సంగీత సాహిత్యం పట్ల ఆసక్తిని రేకెత్తించాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. చదువుతోపాటు కలల పట్ల ఆసక్తి కనబరచడం వలన ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉందని, సమాజంలో ప్రత్యేక గుర్తింపును పొందుతారని అన్నారు. స్వరకర్తగా కృష్ణమోహన్, సంఘ సేవకుడు వామరాజు సత్యమూర్తి, భారత వికాస పరిషత్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా గాయని భూదేవి, యు. గౌరీ శంకర్, ఈడి నాగరాజు, పి. నరేంద్ర కృష్ణ, శివరామకృష్ణ ఆచార్య, బి. శ్రీనివాస్, ఎన్. సదాశివరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం అద్భుతంగా జరిగింది.

విద్యార్థులు అద్భుతమైన గాన ప్రతిభను కనపరచడం వలన ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు.

## మంజీరా నదిలో తల్లి, ఇద్దరు కుమార్తెల మృతి..

మెదక్, అక్టోబర్ 28 మెదక్ జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. మంజీరా నదిలో తల్లి, ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. బుధవారం ఉదయం చిన్న ఘనపూర్ శివారులోని మొదటి బ్రిడ్జి సమీపంలో వారి మృతదేహాలను కొల్చారం పోలీసులు వెలికితీశారు. తల్లితో పాటు ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా కనిపించడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అభం శుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగోల్ల సరిత (27)కు వైష్ణవి (7), సాన్విక (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సరిత భర్త గతంలోనే మృతిచెందడంతో కుటుంబ బాధ్యతలన్నీ ఆమెపైనే పడ్డాయి. పిల్లలను తల్లిగారి ఇంట్లో ఉంచి, హైదరాబాద్‌లో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగించేది. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి కుమార్తెలను చూసి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేది.

కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులతో సరిత తీవ్ర మనోవేదనకు గురైనట్లు బంధువులు తెలిపారు. పిల్లలను తాను పనిచేసే చోట ఉంచుకోలేకపోవడం, మరోచోట వదిలి వెళ్లాల్సి రావడంపై ఆవేదన చెందేదని పేర్కొన్నారు.






## సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
**సుధామ**
సెల్:9849297958

**పోలికలే**
పొలికేకలే

మన నాశనానికి
కారణం
మన
కోరికలే!
**-డా.వనజా రవిచంద్ర**
హైదరాబాదు

**ధ్యేయము**
అమేయము

సంస్కృత భారతాన్ని
తెనిగించి
కీర్తినొందారు
కవిత్రయము.
**-కాకర్ల చెంచలరావు**
ఒంగోలు.

**ఎత్తులు**
పొత్తులు

ఎన్నికలలో
ఎదుటివారిని
గెలిచేందుకు చేస్తారు
జిత్తులు
**-హైమ. కందుకూరి**
లండన్.

**కలిమి**
బలిమి

అందరితో
చెడకుండా ఉండాలి
ఎన్నున్నా
చెలిమి .
**-మా. శ్రీ. రాజు**
పాల్వంచ

**చలి**
పులి

లోకంలో
అన్నిటికన్నా
మనిషిని
వణికించేది గిలి
**-తిప్పావర్తుల నరసింహమూర్తి**
బుచ్చిరెడ్డి పాలెం

**అడప**
దడప

శుభానికి
ప్రాముఖ్యనీ
ప్రాశస్త్యనీ ఇచ్చేదే
గడప!
**-లింగాల యుగంధరాచారి**
మదనపల్లె

**కూర్చు**
చేర్చు

సాహిత్యంలో
ప్రక్రియ ఏదైనా
సమాజాన్ని
మార్చు
**-కె.వి.వి.సత్య ప్రసాద్**
మారేడుబాకదీ

**బంతులు**
వంతులు

షరా మామూలే
ఎన్నికల్లో
నాయకుల
కప్పగెంతులు .
**-వి.సుబ్బారావు**
విశాఖపట్టణం

**ఆదేశం**
ఉపదేశం

మానవతను చాటే
మంచి
మాటే
సందేశం
**-సరోజ రెబ్బాప్రగడ**
బెంగుళూరు

**ఆగిపోతుంది**
వీగిపోతుంది

పలకరింపులు,
రాకపోకలు తగ్గిపోతే
బంధం
తెగిపోతుంది....!!
**-శ్రీమతి భారతీకృష్ణ**
హైదరాబాద్



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని వదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..
-సంపాదకులు

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-వెల్లంకొండ సంపత్ కుమార్

## బడ్జెట్ పేదల పాలిటి పెన్నిధి కాదు?!

బడ్జెట్ పెద్దల నిధి!
పేదల పాలిటి పెన్నిధి కాదు.
బడ్జెట్ అయోమయంగా లెక్కల సర్కస్!
ఆర్థిక సమానతలకు కోసు కోసు దూరం!.
బడ్జెట్ మేధావుల రచనా నైపుణ్యం !
మెదడుకు మేత !
సామాన్యునికి కడుపు కోత!!.
ప్రతి సంవత్సరం బడ్జెట్
ఆశ దోస అప్పడంగా అనిపిస్తుంది !
ప్రకటించాకా అది ఎండమావి !!
కురవని మేఘం!.
రాష్ట్రాలకూ బడ్జెట్ ప్రసాదంగా నాల్గు మెతుకులే
బడ్జెట్ సంశయంగా అందని ద్రాక్షగా చేదే
బడ్జెట్ సకల జనులకు సంతృప్తికరమైతే
దేశానికి స్వర్ణ యుగం వచ్చినట్లే !
బంగారు భారతదేశం !
బడ్జెట్ ఉద్గ్రంథం !!
మహా భారతమంతగా బరువు బరువు..
**-కందాళై రాఘవాచార్య**
8790593638

## ధరలమంట

ఈ రోజుల్లో
బజారుకు వెళ్లాలంటేనే భయం పుడుతుంది
చేతిలో చిల్లిగవ్వ లేని
నిరుపేదల బ్రతుకుల్లో
బియ్యం కొనాలన్న, పప్పులు తేవలన్నా
ధరల దెయ్యం నవ్వుతుంది
కూలీ పెరగడం లేదు కానీ
ధరలు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి
కూరగాయల ధరలు చూస్తేనే
గుండె జారిపోతుంది.
సరిపడా సంపాదనలేని సామాన్యుని జీవనం
నెల బడ్జెట్ లెక్కలువేయడం ఒక్క పెద్ద సమరం
పప్పుల ధరలన్నీ బంగారం ధరలవుతున్నాయి
ప్రతి నెల వచ్చే జీతం
రెండవతేదీకే ఆవిరైపోతుంది
డబ్బులు ఎంత దాచుకున్నామన్నా
ధరల రాక్షసి దోచుకెళుతుంది.
రూపాయికి రూపాలు విలువ పెరుగుతుంది కానీ
మనిషి బ్రతుకు విలువ మాత్రం దిగజారుతోంది
సరుకులు ముందు నిలబడితే
ఆశలన్నీ ఆవిరై దిగులే మిగులుతోంది
ఇప్పట్లో కొనేవాడికి కన్నీరు,అమ్మే వాడికి పన్నీరు
చేతి ఖర్చుల లెక్క చుక్కలు చూపిస్తోంది
ధరల మంట
అది పేదవాడికి గుండెను మండించే చితిమంట!
ఈ ధరలు తగ్గేదెప్పుడో మరి!
**- పి.మృదుల**

## పాఠశాల అంటే

పాఠశాల అంటే పుస్తకాలే కాదు
పక్కవాడి పెన్ను అడిగే చోటు
బెల్ కొట్టగానే ఎగిరే పక్షులమైపోయేవాళ్ళం
టీచర్ వస్తున్నారంటే మాత్రం
పిల్లులమైపోయేవాళ్ళం.
స్నేహితులతో నవ్వుల నావలో తేలేవాళ్ళం
బెంచీలు అయితే మా సొంత జాగలే
బ్లాక్‌బోర్డు మా సినిమా తెర
హోమ్‌వర్క్ అంటే కొండంత భయం
బ్రేక్ అంటే ఎక్కడలేని సంబరం!.
టీచర్ ప్రశ్న అడిగితే
పుస్తకం కోసం వెతికేవాళ్ళం
పరీక్షలొస్తే గుండెల్లో దడదడ మొదలయ్యేది
రిజల్ట్ వస్తే మాత్రం ముఖాలన్నీ
దేవుడా నువ్వే దిక్కు! అన్నట్టు ఉండేవి
ఈ అల్లరి, ఈ నవ్వులు
మేము ఎప్పటికీ మరువలేని జ్ఞాపకాలు!
పాఠశాల అంటే చదువు,
పుస్తకాలు, టీచర్లు మాత్రమే కాదు.
మా నవ్వులు, మా అల్లరి, మా స్నేహాలు కలసిన
ఓ అందమైన ప్రపంచం
**- ఎం.పూజిత**

## ఈ అరాచాలకి అడ్డుకట్టేయండి

కొడుకు పుట్టాడని
కొండంత ఎగిసి పడుతున్నారు కాని
ఆడపిల్ల పుట్టగానే పాతాళంలో పాతేస్తున్నారే
మీరు మనసు లేని బండరాళ్లే.
ఆస్తులకు వారసుడు వచ్చాడని
పండగలు చేసుకుంటున్నారే మరి
పాపం ఆ పసి పాపలు ఏం నేరంచేసారని
అమ్మ ఒడిలోకి చేరకముందే
మృత్యువు ఒడిలోకి చేరుస్తున్నారు.
ఐనా మీరు దయదాక్షిన్యాలు లేని
మనవమృగాలే
వంశాన్ని నిలబెట్టే వంశోద్ధారకుడు
పుట్టాడని సంతోషాన్ని వర్షంగా కురిపించేస్తున్నారు
మరి ఇంటికి వెలుగందించే ఆడపిల్ల జన్మిస్తే
ఆ వెలుగులు బయటికి రాకముందే
చీకటి చావు పంజరంలో బండిచ్చేస్తున్నారే.
మీరు పసి ప్రాణాలను పీక్కుతినే రాంబందువులే
రేపు పెద్దయ్యాక మిమ్మల్ని
ఉద్ధరిస్తారనే ఊహలో ఉండి
పైసల పంజరంలో పెట్టి వారిని పెంచుతున్నారే
కాని ఈ చిన్ని బాలలు
భూమిపైకి అడుగుపెట్టగానే
చెత్తబుట్టిలో వేసి జంతువులకు ఆకారం చేస్తున్నారే
మీరు ఈ చిన్నారుల ఊపిరిని ఆపేసే
క్రూరమైన హంతకులే
ఇప్పటికైనా గుర్తించండి
ఇప్పుడు మీరు చంపుతున్న ఆడవారే
మీకు ఊపిరి పోసారని
ఇప్పుడైనా ఈ అరాచకాలకి అడ్డుకట్టేసి
ఈ చిన్ని బాలలను
ఈ సమాజంలోకి రానివ్వండి.
**-పి.భవ్యశ్రీ**

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.

## కట్ కట్‌బి ఫటాఫట్!

కట్ కట్ !
సినిమాలో ఎడిటింగ్
ఫటాఫట్ సెన్సార్ కత్తెర!
రెండు నాల్కల రెండు కళ్లతో
ఖస్సుమంటుంది సరసరా దేన్నైనా
పరా పరా చింపి పోగులతో
దర్జీ చేతిలో దర్జాగా బిరబిర
రకరకాల సైజులు ఆకారాల్లో
బట్టముక్కలకు
అందాలు కూర్చేలా
ముందుకే సాగుతుంది
వెనక్కి తిరగని
కాలిమడమ తిప్పని కత్తెర!.
పాలపాకెట్టుకి కత్తెర సాయం
వేడివేడి కాఫీతో చిరాకు మాయం
నీటగా గోటుగా
మీసాలు ట్రిమ్
ఇంట్లో అద్దం ముందు
ముద్దుగా నాన్నను చూస్తూ
పిల్లలు చేతికందిన
పేపర్లు, ఫైళ్లు
అమ్మ చీరెలపై కత్తెరతో ప్రయోగాలతో
వీపు విమానం మోతలు
తాషామర్బాలు
సన్నాయిరాగాలు.
కొత్త గా షాపు
ఆఫీస్ ఓపెనింగ్
కత్తెరతో
వెండి కత్తెరతో
సినీభామల రిబ్బన్ కటింగ్
పుస్తకావిష్కరణకి బాగా చుట్టలతో
చుట్టూ బందోబస్తు కి
కావాలి కత్తెర
ఆపై పడుతుంది తెర!.
మొక్కల అందాలకు పెద్ద కత్తెర
శస్త్రచికిత్సకు చిట్టి కత్తెర
క్షురకుని చేతిలో
రకరకాల హీరోల
జుట్ల సొంపు వంపులకై
డబ్బిచ్చి మరీ కత్తెర కాట్లు
యువతుల కొత్తిమీర కట్ట
భుజాలపై జారుతూ
పైకి తోయాలన్నా సాధనా కటింగ్.
నాల్గువేల ఏళ్ల కిందటే
మెసపటేమియాలో ప్రభవించి
రోమన్ల కాలంలో మెరుగులు
ఇంగ్లాండ్ వాసి రాబర్ట్ హించ్ లిఫ్
ఆధునిక కత్తెరల పితామహునిగా
వాసికి
దాక లాగా నోరుతెరిచి
బంధాలు కట్ పద్దు
సూదిలా చేర్చడం ముద్దు
నేడు సర్పంచ్ ఎన్నికల్లో
కత్తెర గుర్తుతో
ప్రచారంలో భాగంగా
ఫ్రీ కటింగ్ కత్తెర డాన్స్
ఇదే మంచి చౌక బేరం
పిల్లల కి ఫ్రీ గా కత్తిరింపు
అందుకోండి ఛాన్స్!.
**-ఎ.రాజ్యశ్రీ**

## ముద్దుగొలిపే చక్కని కత్తెర

కత్తి లేనిదే రోజు గడవదు
దర్జీ కిష్టయ్యకు
మంగలి కోటయ్యకు
దశావతారాలు ఎత్తుతుంది
ఈ కత్తెర గారు
చంటికి సీటు రాలేదని
తండ్రి రామారావు గారికి
చంటికి కత్తెర పడిందనేగా బాధ
చక్కని స్నేహబంధాలను కట్ చేసి
వారి మధ్య అన్యోన్యతను
ముక్కలుగా చేసి
మురిసి ముచ్చట్లకు పోతుంది
ఈ కత్తెర
మా ఆయన చేతిలో
ముద్దు వచ్చే చిన్న కత్తెర
అందంగా మీసాలను కత్తిరిస్తుంది
పిల్లల చేతిలో
క్రాఫ్ట్ వర్క్ చేయడానికి
అందమైన పువ్వులను-
నా చేతిలో పాల ప్యాకెట్లను
కత్తిరించేందుకు
నాకు సమయం దొరికినప్పుడు
బట్టలు కత్తిరించడానికి ఉపయోగం.
రాజకీయ నాయకుల చేతిలోనూ
సినిమా నటుల చేతిలోనూ
రిబ్బన్లు కత్తిరించేందుకు
బంగారు కత్తెర ఉపయోగం.
సినిమాలలో
అవసరం లేని రీళ్లను
కత్తిరించి పారేస్తుంది నిర్భయంగా
మొక్కలు అందంగా ఉండాలంటే
కావాలి పెద్ద కత్తెర
శస్త్ర చికిత్సకు
ఆపరేషన్ థియేటరులో
డాక్టర్ల చేతిలో
తిరుగుతుంది ఈ కత్తెర
అందంగా అమ్మాయిల జుత్తు
కత్తిరించేందుకు
పార్లర్లోనూ ఉపయోగం
ఈ కత్తెర అవతారాలను మార్చుకుంటూ.
**-ఆర్. రమాదేవి**

## కలల రూపాన్నిచ్చే సాధనం

చేస్తుంది కత్తెర
ఎన్నో విశిష్ట కార్యాలు!
ఉండేది ఎప్పుడూ
మంగలి చేతుల్లో పూర్వం!
కదిలేది ఎప్పుడూ
దర్జీ చేతుల్లో మునుపు!
గిరిజాల జుట్టు
ఎవరికైనా కావాలన్నా
అందమైన క్రాపు
మగవారికి కావాలన్నా
మగువల కనుబొమ్మలు
తీర్చిదిద్దాలన్నా
మగవారి మీసమూ గడ్డమూ
ట్రిమ్ చేయాలన్నా
బట్టలను
వివిధ ఆకృతుల్లో కత్తిరించి
అందమైన
చొక్కా పంట్లాములు కుట్టాలన్నా
ఆడవారి
జాకెట్లు, గౌన్లు, లంగాలు కుట్టాలన్నా
రంగు కాగితాలతో
అందంగా కత్తిరించి
తోరణాలు, బుట్టలు
చేయాలనుకున్నా
గాలిపటాలు
తయారు చేయాలనుకున్నా
పేపర్లతో పుస్తకాలు
కుట్టాలనుకున్నా
అందమైన కవర్లు
తయారు చేయాలన్నా
టీ,కాఫీ, పాల ప్యాకెట్లు
తెరవాలనుకున్నా
గాయాలకు
కట్టు కట్టాలనుకున్నా
శస్త్రచికిత్సలో
కుట్లు వేయాలి అనుకున్నా
గాయం మానేక
కుట్లు విప్పాలనుకున్నా
తోటలో పొదలను
అందంగా తీర్చిదిద్దాలన్నా
కొత్త ఆఫీసు సంస్థలు
తెరవాలనుకున్నా
పుస్తకావిష్కరణలో
ప్యాకెట్టు విప్పాలన్నా
కావాలి కత్తెర
ఎవరికైనా, ఎప్పుడైనా!!
ప్రభుత్వ పథకాల
అమల్లో కోతలు
ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో
కోతలు లాంటి సందర్భాలకైతే
కత్తెర కాదు, చెయ్యే చాలు!!.
**-కోలా సత్యనారాయణ**

## రోజువారీ కత్తెర

రెండు రెక్కలై కలిసిన కత్తెర
చేతిలో ఒదిగే చిన్న మిత్రురాలు
కాగితాన్ని కోసి రూపం ఇచ్చి
కళకు అందం చేకూర్చే సాధనం.

బట్టల కొలతలు సరిచేసి
అందమైన వస్త్రాలుగా మలచి
పూలను, ఆకులను కాగితంపై
కళాత్మకంగా తీర్చిదిద్దుతుంది.
పుస్తకాల పుటలు సరిచేయడంలో
చేతిపనులలో తోడుగా నిలిచి
మనిషి పనిని సులభం చేసే
మంచి పనిముట్టుగా వెలుగుతుంది
చిన్నదైనా పదునైన శక్తితో
పెద్ద పనులనే చక్కగా చేస్తుంది
జాగ్రత్తగా ఉపయోగిస్తే మేలు
అజాగ్రత్త చేస్తే అపాయం కూడా!.
కత్తెర కేవలం కోసేది కాదు
కళకు కొత్త రూపం ఇచ్చేది
మన చేతుల్లోని సాధనమే కాదు
సృజనకు సహకరించే నేస్తమది!.
**-వి.సంధ్యారాణి**

## కత్తిరింపే నైజం

రెండు నాలుకలు ఏకం చేసి
కత్తిరించే చురుకైన సాధనం.
క్షురకుని చేతిలో
ఆటలాడుతూ
లింగభేదం లేక
జుట్టును రకరకాలుగా
తీర్చిదిద్దే ఆయుధం
పుట్టు వెంట్రుకలు మొదలు
పోయేంతవరకు దానితోనే పని
అది లేకుంటే
జుట్టు అరణ్యమే!!.
అందమైన బట్టలు వేయడానికి
అనుకూలంగా మలచే
దర్జీ చేతి ఆభరణం!!.
అమ్మమ్మ తాతయ్యకు
వక్కలు ముక్కలుగా చేసే
హస్త లాఘవం!!.

## బృహత్తర సాధనం

పూర్వం కత్తెరకు
స్థానం రెండుచోట్లే
ఒకటి మంగలి
రెండు దర్జీ
ప్రస్తుతం కత్తెర లేని చోటు
దాని గాట్లు పడని
విషయం లేదంటే
అతిశయోక్తి కానే కాదు
యోగ్యత ఉన్న విద్యార్థికి
సీటు రాలేదంటే
కత్తెర పడిందనే గదా

శృంగారానికి వేసే సినీ కత్తెరచేతిలో కత్తెర
ఎంతేని విచ్ఛలవిడితనానికి సంసారంలో
వేయాలి కత్తెర పోటు!!. ఒడిదుడుకులకు సూచన!!.
అతివాగుడుకు చోరులకు నేస్తం
వేయాలి కత్తెర పోటు కత్తిరింపు దాని నైజం
అతి స్వేచ్ఛకు బండబారితే సానపెట్టడమే
అడ్డుకత్తెర వేసి విరుగుడు మందు!!.
హద్దులు పెట్టాలి సుమా!!. **-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**
పెళ్లి కొడుకు

కోటిరూప్యములకు కొనుగోలు ఇందుగలడందులేడని
జరిగిందని తెలిసి కత్తెర
గగ్గోలు పెట్టినా విశ్వమంతా వెలసి
తగ్గదు కత్తెర స్నేహలు కట్ చేసి
తన కత్తిరింపులో శాంతిని ముక్కలు చేసి
పంట పండిన ఇంట భూదేవి ఒడలంతా
పస్తులేనంట ముక్కలు ముక్కలుగా చేసి
కత్తెర పడిన చోట మురిసిపోయే కత్తెరను
పప్పు పరమాన్నాలు మన చెంతకు చేరనీయవద్దు
మనిషికీ మనిషికీ మధ్య కత్తి ఉన్నది
మహమ్మారి కత్తిపీట ఉంది
కత్తెర కాపుగాచి అవి మనకు చాలు
కాపురాలే గాక కత్తెరను వారిద్దరే
భగవంతుని ఉంచుకుంటే మేలు.
గోపురాలు కూడా కూల్చి **-డా.సి.వసుంధర**